thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

# చురకలు

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 94 | జగిత్యాల | గురువారం | 02 జులై, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## నేటి నుంచే ఇంగ్లాండ్ తో పోరు




11

## 14,115 కోట్లతో వెగా హైవే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్!



- ప్రధాని మోదీ అధ్యక్షతన కేబినెట్ భేటీ
- భారీ రహదారుల ప్రాజెక్టులకు ఆమోదం

4

## బాలికపై 30మంది అఘాయిత్యం

- బలవంతంగా మద్యం తాగించి దారుణం
- నిందితుల 4 హోటళ్లపై బుల్డోజర్ యాక్షన్
- ఇప్పటివరకు పన్నెండు మంది అరెస్ట్

4

రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో 13 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక లైంగికదాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో బాధిత బాలికపై ఐదు రోజుల పాటు 30 మందికి పైగా వ్యక్తులు పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఘటనపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్‌కు దిగింది.






# నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వద్దు

### వాస్తవికత ఆధారంగానే బడ్జెట్ రూపకల్పన జరగాలి




## ఏఐతో ట్రాఫిక్ నియంత్రణ!

- ఫిజికల్ ఇంటెలిజెన్స్‌తో సత్వర పరిష్కారాలు
- ఎంసీహెచ్ఆర్డీలో సీఎం రేవంత్ కీలక భేటీ
- అనలాగ్, మెగా సంస్థలతో ఒప్పందం

2వ పేజీలో..

- శాఖల వారీగా సామర్థ్యం మెరుగు పరుచుకోవాలి
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్ కేటాయింపులు
- ఏఐ టెక్నాలజీతో డీబీటీకి అనుసంధానం
- భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎంసీహెచ్ఆర్డీలో అధికారులకు దిశానిర్దేశం

**ఆదాయ సమీకరణ కోసం ప్రత్యేక ఛేజింగ్ సెల్**

2వ పేజీలో..

రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఎంసీహెచ్ఆర్డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ తదితర వివిధ శాఖలకు సంబంధించి ఎక్కడా లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సీఎం సూచించారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ప్రత్యేకంగా ఛేజింగ్ సెల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనులు జరగాలంటే శాఖల వారీగా అధికారుల పని సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని దిశానిర్దేశం చేశారు.

## చర్చకు రెడీ!

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చిద్దాం
- తేదీ, సమయం చెబితే రావడానికి సిద్ధం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

3



## ఈగల్ టీమ్ దాడులు

మణికొండలో హాష్ ఆయిల్ విక్రేత పట్టివేత

## ఓఆర్ఆర్‌పై కాల్పులగీ

- పోలీసులపై క్రిమినల్ దాడి
- పోలీసుల ఎదురుకాల్పులు
- శ్రీకాంత్ కాలికి తగిలిన బుల్లెట్లు
- హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



3

## 'ఎజెండా మారాలి!'

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మూసీకి లక్ష కోట్లు ఎలా
- అధికారంలోకి వస్తే ఉచిత విద్య
- రేవంత్ పాలనపై కవిత ఫైర్



2

## 'రైతుల పేరిట డ్రామాలు!'

- దృష్టి మరల్చేందుకే కొత్త ఎత్తుగడలు
- వైఫల్యాలపై ఎక్కడైనా చర్చకు సిద్ధం
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు





## మీ సేవలు అమోఘం!

ప్రాణాలను కాపాడుతున్న ప్రభుత్వ వైద్యులు

రాష్ట్రంలో నాణ్యమైన వైద్య సేవలు

2

## రైతులను బెదిరించి డబ్బులు వసూలు

ఫిర్యాదుతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్

3



## రూ.3 కోట్ల లంచం కేసగీ

ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లోవత్ 3 కోట్ల రూపాయల లంచం కేసులో సీబీఐ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. కేసు వివరాలను అధికారులు బుధవారం మీడియాకు వెల్లడించారు.

4

## నేడు కేబినెట్ భేటీ!

- సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం
- మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ భేటీ
- అందుబాటులో ఉండాలని సీఎస్ ఆదేశాలు
- మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుపై ప్రధాన చర్చ
- మెట్రో విస్తరణపై కార్యాచరణ రూపకల్పన

2





# నేడు కేబినెట్ భేటీ!

**సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం**

**మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ భేటీ**

**అందుబాటులో ఉండాలని సీఎస్ ఆదేశాలు**

**మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుపై ప్రధాన చర్చ**

**మెట్రో విస్తరణపై కార్యాచరణ రూపకల్పన**

**హైదరాబాద్, జూలై 1:** తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి (కేబినెట్) సమావేశం గురువారం జరగనుంది. సచివాలయంలో జరగనున్న ఈ భేటీలో కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపిన మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర సచివాలయంలోని 6 వ అంతస్తులో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఇది 34 వ మంత్రిమండలి సమావేశం కావడం గమనార్హం. ఈ కేబినెట్ భేటీ జరిగే సమయంలో అధికారులందరూ తప్పనిసరిగా తమ హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సీఎస్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. వివిధ కీలక అంశాలపై ఈ కేబినెట్ సమావేశంలో మంత్రులు చర్చించనున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టుకు అధికారికంగా ఆమోదం తెలిపింది. అదేవిధంగా నగరంలో మెట్రో రైలు విస్తరణకు కూడా పచ్చజెండా ఊపింది. ఈ క్రమంలో ఈ భారీ ప్రాజెక్టుల విషయంలో ముందుకెళ్లేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపైన కేబినెట్‌లో ప్రధానంగా చర్చించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# రేవంత్ పదవి మరికొన్ని నెలలు మాత్రమే

**సీఎం రేవంత్‌పై బీజేపీ తీవ్ర ఆగ్రహం**

**నితిన్ నబీన్‌పై విమర్శలకు స్ట్రాంగ్ కౌంటర్**

**మీ రోజులు దగ్గరపడ్డాయని శుక్లా హెచ్చరిక**

**న్యూఢిల్లీ, జూలై 1:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను సీఎం రేవంత్ ఎగతాళి చేయడంపై ఆ పార్టీ జాతీయ ప్రతినిధి ప్రేమ్ శుక్లా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మీ రోజులు దగ్గరపడ్డాయంటూ ఆయన ఘాటుగా హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌తో తెలంగాణను పోల్చడంపై తెలంగాణ సీఎంకు ప్రేమ్ శుక్లా గట్టి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ నేతల అహంకారం, వారి చంచల రాజకీయం త్వరలోనే కుప్పకూలుతుందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాజయం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అహంకారానికి త్వరలోనే తెరపడనుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే ఇప్పుడు కాంగ్రెస్‌కు పడుతుందని ప్రేమ్ శుక్లా హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిచి చూడాలని, 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అని ఆయన గుర్తుచేశారు. 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పదవి మరికొన్ని నెలలు మాత్రమే ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ రోజులు దగ్గరపడ్డాయంటూ బీజేపీ నేత ప్రేమ్ శుక్లా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# మీ సేవలు అమోఘం!

**ప్రాణాలను కాపాడుతున్న ప్రభుత్వ వైద్యులు**

**రాష్ట్రంలో నాణ్యమైన వైద్య సేవలు**

**వైద్యులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**

**మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం**

**జూనియర్ డాక్టర్లకు 15 శాతం స్టైఫండ్ పెంపు**

**హైదరాబాద్, జూలై 1:** జాతీయ వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే) సందర్భంగా రాష్ట్రంలోని వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న వారి సేవలు వైద్య వ్యవస్థకు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. తమ నైపుణ్యంతో ప్రతిరోజూ వేలాది ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసించారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని, మొత్తంగా సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేరుస్తూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామన్నారు. ఈ రెండున్నరేళ్లలో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు వివరించారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని గుర్తుచేశారు. అద్దె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, సేవలను

# నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వద్దు

- సామర్థ్యం మెరుగు పరుచుకోవాలి
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్
- ఏఐ టెక్నాలజీతో డీబీటీకి అనుసంధానం
- ప్రత్యేక ఛేజింగ్ సెల్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 1:** రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఎంసీహెచ్‌ఆర్డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ తదితర వివిధ శాఖలకు సంబంధించి ఎక్కడా లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సీఎం సూచించారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ప్రత్యేకంగా ఛేజింగ్ సెల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనులు



జరగాలంటే శాఖల వారీగా అధికారుల పని సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని దిశానిర్దేశం చేశారు.

## ఏఐ టెక్నాలజీతో అనుసంధానం..

తాజా ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను నేరుగా డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులతో పాటు ఇతర కీలక పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగానే బడ్జెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల కోసం భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు.

## వాస్తవికత ఆధారంగానే బడ్జెట్..

కేవలం ఊహాజనిత బడ్జెట్ కాకుండా.. వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు సీఎం తేల్చిచెప్పారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏఐతో ట్రాఫిక్ నియంత్రణ!

- ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం రేవంత్ కీలక భేటీ
- అనలాగ్, మెగా సంస్థలతో ఒప్పందం
- ఏఐ ఆధారంగా సిగ్నల్స్ పనిచేయాలి
- ఫిజికల్ ఇంటెలిజెన్స్ తో సత్వర పరిష్కారాలు
- మెరుగైన మౌలిక సదుపాయాల అభివృద్ధి

**హైదరాబాద్, జూలై 1:** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ తదితర సమస్యల పరిష్కారానికి అత్యాధునిక సాంకేతికతను వినియోగించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎంఈఐఎల్) ఎండీ పి. కృష్ణారెడ్డి తదితరులతో ఎంసీహెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ ప్రతినిధులు, హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనలాగ్, ఎంఈఐఎల్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపట్టే ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా ప్రధానంగా చర్చించారు. భవిష్యత్ తరాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై ఆయా సంస్థల ప్రతినిధులు సీఎంకు వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ఆయన ముందు ఉంచారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారం చూపే సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. సెన్సార్లు, రోబోటిక్స్ లాంటి



ఫిజికల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో పట్టణ రవాణా వ్యవస్థను ఎలా సమర్థవంతంగా, భద్రంగా అభివృద్ధి చేయవచ్చో వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి సిగ్నల్స్ నిర్వహించడం, నీటి లీకేజీలను ముందే పసిగట్టి మరమ్మతులు చేయడం, అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఫైర్ ఇంజన్లకు ట్రాఫిక్ క్లియర్ చేయడం లాంటి పనులకు ఏఐ టెక్నాలజీ ఎలా ఉపయోగపడుతుందో ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ అన్నింటినీ ఇంటిగ్రేట్ (అనుసంధానం) చేయాలని ఆయన ఆదేశించారు. కేవలం టైమర్ల ఆధారంగా కాకుండా ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా ఈ సిస్టమ్‌ను ఏఐ సాంకేతికతకు అనుసంధానించాలని సూచించారు. ఈ సమావేశం అనంతరం సీఎం సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పర సాంకేతిక సహకారం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం భవిష్యత్తులో కీలకంగా మారనుంది.

# రైతుల పేరిట డ్రామాలు!

- దృష్టి మరల్చేందుకే కొత్త ఎత్తుగడలు
- రైతుల అసలు సమస్యలపై పట్టని వైనం
- వైఫల్యాలపై ఎక్కడైనా చర్చకు సిద్ధం
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు సవాల్

**హైదరాబాద్, జూలై 1:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి రైతుల పేరిట కొత్త డ్రామాలకు తెరతీశారని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై ఆయన విరుచుకుపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని హరీశ్ రావు ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మాట్లాడేవన్నీ చేతగాని మాటలు, చెత్త వాగుడు తప్ప వాటి వల్ల రైతులకు కొత్తగా ఒరిగింది ఏమీ లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లోని డొల్లతనాన్ని ఆయన ఆధారాలతో సహా ఎండగట్టారు.

## ఎవరి లెక్కలు నిజం?

ఒకే సభలో ఉంటూ.. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం 1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం 1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమని హరీశ్ రావు ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో చేసింది ఏమీ లేదు కాబట్టే ఇద్దరూ ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

## బడ్జెట్‌లో లేని డబ్బును..

2027 మార్చి 31 వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బడ్జెట్ కేటాయింపులే సుమారు 82 వేల కోట్లు అయితే, జూన్ 2026 నాటికే లక్షా 56 వేల కోట్లు, లక్షా 75 వేల కోట్లు ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. బడ్జెట్‌లో లేని డబ్బును ఖర్చు చేశారా? లేక రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా?



అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలను పదిసార్లు చెప్పినా అవి నిజాలు కావని, లేనివి ఉన్నట్లు చెప్తే రైతులు నమ్మరని హితవు పలికారు.

## దారుణంగా మోసం చేశారు..

ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు అడిగారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కేవలం స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను దారుణంగా మోసం చేయడమే కాదా అని హరీశ్ రావు ప్రశ్నించారు. ఇదే ముందే చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్‌ను నమ్మేవారా అని అడిగారు. మేనిఫెస్టోలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఫేక్ ప్రచారాలు చేసుకోవడం ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను ఎలా గాలికి వదిలేశారో, అన్నదాతను ఎలా మోసం చేశారో నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. దీనిపై చర్చించేందుకు కేవలం అసెంబ్లీ మాత్రమే కాదు, ఏ వేదికపైనైనా తాము సిద్ధమని హరీశ్ రావు సవాల్ విసిరారు.

# ఎజెండా మారాలి!

**హామీల అమలులో ప్రభుత్వం విఫలం**

**అధికారంలోకి వస్తే ఉచిత విద్య**

**రేవంత్ పాలనపై కవిత ఫైర్**

**హైదరాబాద్, జూలై 1:** రాష్ట్ర ఎజెండా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేశామని ఆమె ఉద్ఘాటించారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా పేద ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే మళ్లీ అధికారంలోకి వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలలు కంటున్నారని ఆమె తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవని చెబుతూ.. మరోవైపు మూసీ ప్రాజెక్టు కోసం 1 లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని ప్రభుత్వం చెప్పడం ఏమిటని కవిత నిలదీశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఉచిత విద్యతో పాటు ఉచిత వైద్యాన్ని అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కచ్చితంగా రాష్ట్ర ఎజెండా మారుస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, కేవలం హార్డ్ వర్క్‌నే నమ్ముకోవాలని కవిత దిశానిర్దేశం చేశారు.



చురకలు



# ఎలినినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం



- పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి
- వరి బదులు ఆరుతడి పంటలపై సీఎం సూచనలు

**హైదరాబాద్, జూలై 1:** నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, అందువల్ల రైతులు ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలని కోరారు. వరికి అసవరమైన నీరు లభించనప్పుడు, ఆరుతడి పంటలవైపు మళ్లాలలని అన్నారు. దీంతో రైతులు కూడా ఈదిశగా ఆలోచన చేయాల్సి ఉంది. అదేపనిగా వరి పండించడం వల్ల కూడా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఈ అవకాశాన్ని ఆసారగా తీసుకుని మార్పుకోసం ప్రయత్నిస్తే మంచిదే. ఎందుకంటే వర్షాలు పడతాయో లేదో తెలియడం లేదు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో నారు వేసే పరిస్థితి లేదు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సిఎం ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంగా కనిపిస్తోంది. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది.

# వీబీ జీ రామ్ జీ ని రద్దు చేయాలి

## సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ఆందోళన




**ఖమ్మం, జూలై 1:** పేదలకు ఉపాధిని దూరం చేసే వీబీ జీ రామ్ జీ ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి తాసీల్దార్ కార్యాలయం, ఎర్రబోడు, మాణిక్యారం, విశ్వనాధపల్లి, గాంధీనగర్, గాదెపాడు, చీమలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట అందోళన చేపట్టారు. అంక్షలు లేకుండా పేదలకు ఉపాధి కల్పించాలని, రైతులకు నష్టదాయకమైన విద్యుత్ సవరణ చట్టం, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ కె.నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీని రద్దు చేసి వీబీ జీ రామ్ జీ పేరుతో పేదలకు ఉపాధి దూరం చేయుటకు పూనుకుందన్నారు. వీబీ జీ రామ్ జీ బిల్లును జులై 1 నుండి అమలు చేయనున్నట్లు ప్రకటించిందని, దీనిలో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులు భరాయించాలని పేర్కొనడం ఉపాధి కల్పన నుండి కేంద్రం దూరం జరగటమేనన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రైతు భరోసా ఎగవేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు డిస్టిబ్యూషన్ కంపెనీని ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ కు మంగళం పాడే పరిస్థితిని తీసుకరానుందన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరుపై పోరాటాలే శరణ్యమన్నారు. పోరాటాలతోనే పాలకుల దిగివచ్చి పేదలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పలువురు పాల్గొన్నారు.

# చర్చకు నేను రెడీ!

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చిద్దాం
- తేదీ, సమయం చెబితే రావడానికి సిద్ధం
- పదేపదే తెలంగాణను కించపరచొద్దు
- ఇజ్జత్ పోయినప్పుడు ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి?



**హైదరాబాద్, జూలై 1:** కేసీఆర్ అధికారంలో నుంచి దిగిపోయేనాటికి 3.50 లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందని, కానీ అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ ఢిల్లీకి 72 సార్లు ఎందుకు వెళ్లారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని, ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని విమర్శించారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా? అని సీఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాలన్నారు.

### ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది..

తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ తీర్చిదిద్దారని కేటీఆర్ గుర్తుచేశారు. 2014-15 లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26 లక్షల హెక్టార్లు మాత్రమేనని, కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందడుగు వేసి అద్భుతాలు చేశామన్నారు. హైదరాబాద్‌ను చూసి న్యూయార్క్‌లా ఉందని రజినీకాంత్ అన్నారని, మేఘాలయ సీఎం సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి అభినందించారని, ఫాక్స్‌కాన్ చైర్మన్ కూడా గతంలో ప్రశంసలు కురిపించారని వివరించారు.

### రాష్ట్రాన్ని కించపరుస్తున్నారు..

సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని కించపరుస్తూ అవమానిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దు అని హితవు పలికారు. ఇంతటి భావదారిద్ర్యం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదన్నారు. తెలంగాణ గొప్పదనం రేవంత్‌కు జీర్ణం కాకపోవచ్చని, పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుస్తారని నిలదీశారు. సీఎం, డిప్యూటీ సీఎం అబద్ధాలు చెప్పడంలో కూడా పొంతన లేదని, కాగ్ లెక్కలు నమ్మాలా? కాకి లెక్కలు నమ్మాలా? అని ప్రశ్నించారు. సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోందన్నారు. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఆరోపించారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలన్నారు. అబద్ధాలు ఆడటం రేవంత్‌కు జన్మహక్కు అని, ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదన్నారు. అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి 200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారని, కాంపౌండ్ వాల్ నిర్మాణానికే 19 కోట్లు ఖర్చు చేశారని దుయ్యబట్టారు.

### ఎక్కడైనా నేను రెడీ..

కాంగ్రెస్ పాలనపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని, తేదీ, సమయం ఫిక్స్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీనా? ప్రెస్‌క్లబ్‌లోనా? జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా? ఎక్కడైనా తాను రెడీ అన్నారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా? 2 లక్షల ఉద్యోగాలని రాహుల్ గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా? మీరు వస్తారో, రాహుల్ గాంధీ వస్తారో రండి అని సవాల్ విసిరారు. మీ తప్పులను గణాంకాలతో సహా బయటపెడతామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# బైక్ దొంగల అరెస్ట్!

- అత్తాపూర్ పోలీసుల చేతికి చిక్కిన ముఠా
- ఇద్దరు పాత నేరస్థులకు కోర్టు రిమాండ్
- పరారీలో ఉన్న మరో ఇద్దరు
- 5 ద్విచక్ర వాహనాల స్వాధీనం
- సీసీటీవీ కెమెరాలతో నిందితుల గుర్తింపు

**హైదరాబాద్, జూలై 1:** జల్సాలు, చెడు వ్యసనాలకు బానిసలై బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు పాత నేరస్థులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శివరాంపల్లి పిల్లర్ నంబర్ 295 వద్ద ఇటీవల రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ దొంగతనం జరగడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సీసీటీవీ కెమెరాల ఆధారంగా దొంగలను అత్తాపూర్ పోలీసులు గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగి నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో వీరంతా జల్సాలు, చెడు వ్యసనాల కోసమే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది.

### గాలింపు చర్యలు ముమ్మరం..

అరెస్ట్ అయిన వారిలో మహమ్మద్ షానవాజ్, మహమ్మద్ మొయిజ్ మోహియుద్దీన్ ఉన్నట్లు అత్తాపూర్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. పరారీలో ఉన్న శాస్త్రీపురానికి చెందిన నూర్, ఫర్హాన్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో రాయల్ ఎన్‌ఫీల్డ్, సుజుకి బర్గ్‌మన్, యాక్టివా వాహనాలు ఉన్నాయి. అరెస్టయిన వారు గతంలోనూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఓఆర్ఆర్ పై కాల్పులు!

- పోలీసులపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దాడి
- ఆత్మరక్షణ కోసం పోలీసుల ఎదురుకాల్పులు
- బూషి శ్రీకాంత్ కాలికి తగిలిన బుల్లెట్లు
- దాడిలో హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- వనస్థలిపురం ఆసుపత్రికి నిందితుడి తరలింపు



**హైదరాబాద్, జూలై 1:** హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున కాల్పులు కలకలం సృష్టించాయి. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బూషి శ్రీకాంత్‌ను పట్టుకునేందుకు వెళ్లిన నల్గొండ సీసీఎస్ పోలీసులపై అతడు కత్తితో దాడి చేశాడు. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో నిందితుడు తీవ్రంగా గాయపడ్డాడు. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నాడనే సమాచారంతో అతడిని పట్టుకునేందుకు నల్గొండ సీసీఎస్ పోలీసుల బృందం రంగంలోకి దిగింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ సమీపంలోని బొంగులూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో అతడు పోలీసులపై తిరగబడి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో నల్గొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకూ గాయాలయ్యాయి. నిందితుడు తప్పించుకునేందుకు యత్నిస్తూ విచక్షణారహితంగా దాడికి దిగడంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం ముందుగా గాల్లోకి 3 రౌండ్లు కాల్పులు జరిపారు. ఆ తర్వాత నిందితుడి కాళ్లపై కాల్చారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. తలకు గాయమైన హెడ్ కానిస్టేబుల్‌ను, అలాగే గాయపడిన నిందితుడు శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం వనస్థలిపురంలోని ఆసుపత్రికి తరలించారు.

### కానిస్టేబుల్ ను చంపి..

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన బూషి శ్రీకాంత్ తొలుత చిన్నచిన్న దొంగతనాలు చేసేవాడు. 2007 లో అతడిని అరెస్టు చేసే క్రమంలో కానిస్టేబుల్ వేణుబాబును చంపి పారిపోయాడు. అప్పటి నుంచి 120 కి పైగా నేరాలు చేశాడు. ఒక్క నల్గొండ జిల్లాలోనే అతడిపై సుమారు 300 వరకు కేసులు ఉన్నట్లు సమాచారం. దీంతో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శ్రీకాంత్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు బుధవారం ఉదయం నిందితుడిని పోలీసులు పట్టుకోగలిగారు.

# ఈగల్ టీమ్ దాడులు!

- ఐటీ కారిడార్‌లో ఈగల్ టీమ్ దాడులు
- మణికొండలో హాష్ ఆయిల్ విక్రేత పట్టివేత
- ప్రైవేట్ హోటల్‌లో పట్టుకున్న అధికారులు
- నిందితుడి నుంచి 9 గ్రాముల సీజ్
- కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు




**హైదరాబాద్, జూలై 1:** హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మణికొండలో 'ఈగల్ టీమ్' బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. పక్కా సమాచారంతో ఓ ప్రైవేట్ హోటల్‌లో మెరుపు దాడులు చేసిన అధికారులు.. హాష్ ఆయిల్ విక్రయిస్తున్న వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మణికొండలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని ఈగల్ టీమ్ సభ్యులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద తనిఖీలు చేపట్టగా.. 9 గ్రాముల లిక్విడ్ హాష్ ఆయిల్ దొరికింది. దానిని అధికారులు వెంటనే సీజ్ చేశారు. పట్టుబడ్డ నిందితుడితో పాటు సీజ్ చేసిన హాష్ ఆయిల్‌ను తదుపరి విచారణ నిమిత్తం స్థానిక నార్సింగి పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వ్యక్తి డ్రగ్స్ విక్రేతా? లేక ఏజెంటా? అనే కోణంలో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హాష్ ఆయిల్‌ను నగరానికి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు? ఐటీ కారిడార్‌లో ఎవరెవరికి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నారనే అంశాలపై నిందితుడిని పోలీసులు తీవ్రంగా విచారిస్తున్నారు. నగరంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిఘాను మరింత కఠినతరం చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

# మహారాష్ట్రలో బాబ్లీ గేట్లు ఎత్తివేత

**నిజామాబాద్,జూలై1:** మహారాష్ట్రలోని ఎగువ గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ గేట్లను సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి), మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ అధికారుల సమక్షంలో 14 గేట్లను ఎత్తివేశారు. బాబ్లీ ప్రాజెక్టులో నీటి నిల్వ స్వల్పంగా ఉండడంతో తెలంగాణ ప్రాంతానికి కేవలం 0.20 టిఎంసిల వరద మాత్రమే వచ్చింది. ఈ దశాబ్ద కాలంలో ఎగువ గోదావరి నుంచి ఇంత తక్కువ మొత్తంలో వరద రావడం ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎత్తిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబర్ 28వ తారీఖు వరకు తెరిచి ఉంటాయి. అంతర్ రాష్ట్ర జలవివాదాలు నేపథ్యంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలంలో, ఎండాకాలంలో బాబ్లి గేట్లను ఎత్తి దిగువకు వరద వదిలిపెడుతున్నారు.

# ప్రగతి ప్రణాళిక అమలుపై ఆరా

## అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్,జూలై1:** రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించిన నోడల్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన సమస్యలు, సవాళ్లను సిఎస్ కు వివరించారు. అలాగే జిల్లాలలో అమలు చేసిన వినూత్న విధానాలతో సానుకూల ఫలితాలు వచ్చాయని, వాటిని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్లతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోడల్ అధికారులను ఆదేశించారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ 99 రోజుల కార్యక్రమంపై పవర్-పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలను అందించారు. కార్యక్రమంలోని వివిధ అంశాల కింద ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఆయన వివరించారు. సమీక్షాసమావేశంలో ప్రధాన కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యమా? నిరంకుశత్వమా?

ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించడం పౌరుల ప్రాథమిక హక్కు. కానీ ఏపీలో ఇప్పుడు ప్రశ్నించడమే అతిపెద్ద నేరంగా మారిపోయినట్లు కనిపిస్తోంది. పాలకుల విధానాలను ఎత్తిచూపితే చాలు.. పోలీసు వ్యవస్థను ప్రయోగించి గొంతు నొక్కే అప్రజాస్వామిక సంస్కృతి పేట్రేగిపోతోంది. జర్నలిస్టు కేవీఆర్, సోషల్ మీడియా యాక్టివిస్ట్ ప్రశ్న రావణ్‌లను కిడ్నాప్ తరహాలో అరెస్టు చేసిన తీరు రాష్ట్రంలో రాజ్యమేలుతున్న నిరంకుశత్వానికి నిలువుటద్దం. కక్ష సాధింపుల కోసమే వ్యవస్థలను ఇలా దుర్వినియోగం చేస్తుంటే.. ఇక ఎన్నికలు, రాజ్యాంగం అనే పదాలకు అర్థం ఏముంటుంది?

నేరం చేసిన వారిని చట్ట ప్రకారం అరెస్టు చేయడంలో తప్పులేదు. కానీ ఆ అరెస్టు అధికారికంగా, చట్టబద్ధంగా జరగకపోవడమే ఇక్కడ అసలు సమస్య. వారు ఏం మాట్లాడారు, ఎలా మాట్లాడారు అనేది న్యాయస్థానాలు తేలుస్తాయి. అంతమాత్రాన ఉగ్రవాదులను పట్టుకున్నట్లుగా పోలీసు బలగాలతో వచ్చి అరెస్టులు చేయాల్సిన అవసరం ఏముంది? ఏపీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉన్నారా, అసలు ఆయన ఏమయ్యారు అనే సందేహాలు సామాన్యుల్లో సైతం వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే విపక్ష నేతలను, సామాన్య ప్రజలను, జర్నలిస్టులను టార్గెట్ చేసి అరెస్టుల పర్వానికి తెరలేపారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

## పాలకులకో న్యాయమా..

అధికార పీఠం మీద కూర్చున్న వారు నిత్యం మైకుల ముందు బూతులు వాంతి చేసుకున్నా చెల్లుబాటవుతుంది. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పూనకం వచ్చినట్లు ఊగిపోతూ 'చెప్పు తీసుకుని కొడతా' అని బూతులు మాట్లాడినా చట్టం తన పని తాను చేయదు. 'తాట తీస్తా' అని ఆయన అన్నప్పుడు లేని తప్పు.. ఇప్పుడు సమాజంలోని అణగారిన వర్గాలకు చెందిన రావణ్ లాంటోళ్లు ప్రశ్నిస్తే మాత్రం ఎందుకు నేరమవుతోంది? రాధా మనోహర్ అనే వ్యక్తి నిత్యం వీధుల్లో తిరుగుతూ వేరే మతాల దేవుళ్లను అసభ్య పదజాలంతో దూషిస్తే కేసులు నమోదు కాని పరిస్థితి. అదే వ్యక్తిని రావణ్ ప్రశ్నిస్తే మాత్రం వెంటపడి కేసులు పెడతారా?

## వర్గ దృక్పథం దాక్కుంటుందా..

ఆధిపత్య రాజకీయాలకు దన్నుగా నిలుస్తూ అణగారిన గొంతులను అణచివేసేందుకు ఏపీలో పోలీసు వ్యవస్థను పూర్తిస్థాయిలో వాడుకుంటున్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షానికి చెందిన నాయకులు, వారి అనుచరులు సామాజిక మాధ్యమాల్లో నిత్యం అసభ్య పదజాలంతో దూషిస్తున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు. అదే సామాన్యులు, దళిత బహుజన వర్గాలకు చెందిన వారు ప్రభుత్వాన్ని విమర్శిస్తే మాత్రం దేశద్రోహుల స్థాయిలో కేసులు నమోదు చేసి వేధిస్తున్నారు. చట్టానికి, న్యాయానికి ఒక వర్గ దృక్పథం ఉందనడానికి ఏపీలో జరుగుతున్న ఈ పరిణామాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఇక్కడ రాజ్యమేలుతున్నదంతా ఆ 'మను'స్వామ్యపు వర్గ దృక్పథమే అన్నది హక్కుల సంఘాల మాట.

## సెక్షన్ల దుర్వినియోగంతో అణచివేత..

ఇటీవల ఏలూరు దళిత క్రైస్తవ సమర శంఖారావం సభలో ప్రశ్న రావణ్.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లపై బహిరంగ వ్యాఖ్యలు చేశారు. దీనిపై పిఠాపురం ఆసుపత్రి డైరెక్టర్, జనసేన నాయకుడు బొజ్జ రామ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కక్షపూరితంగా వ్యవహరించారు. రావణ్‌పై ఏకంగా బీఎన్ఎస్ 196, 352, 356(2), 356(3), 111 సెక్షన్లతో పాటు ఐటీ చట్టం సెక్షన్ 66 కింద కేసులు నమోదు చేసినట్లు చర్చ జరుగుతున్నది. హైదరాబాద్‌లో అతడిని అదుపులోకి తీసుకుని ఏపీకి తరలించి విచారిస్తున్నారు. రావణ్ చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న వారి వివరాలను సైతం పోలీసులు సేకరిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారు.

## ఉగ్రవాదులా.. విద్రోహ శక్తులా..

పోలీసుల తీరుపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్రంగా స్పందించారు. అరెస్టులకు ఆదేశాలు ఇచ్చేవాళ్లు పిరికివాళ్లా అని ఆయన నేరుగా ప్రభుత్వాన్ని నిలదీశారు. అరెస్టయిన కేవీఆర్, రావణ్ ఏమైనా ఉగ్రవాదులా లేక సంఘ విద్రోహక శక్తులా అని ప్రశ్నించారు. ఏపీలో జరుగుతున్నవి కిడ్నాపులు, అరాచకాలు, అణచివేత చర్యలేనని స్పష్టం చేశారు. వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని భావప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న ఈ దాడిని పౌర హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అక్రమ కేసులతో అరెస్టు చేసిన తెలంగాణ జర్నలిస్ట్ కేవీఆర్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోకపోతే ప్రజాగ్రహం చవిచూడక తప్పదు.

# అయోధ్య రామాలయ విరాళాల స్కామ్

- మాజీ ట్రస్టీకి బిగుస్తున్న ఉచ్చు
- వాష్‌రూమ్‌ల్లో నగదు దాచి బయటకు తరలింపు
- సిట్ విచారణలో సంచలన విషయాలు
- అనిల్ మిశ్రా పాత్రపై అనుమానాలు
- బ్యాంక్ సిబ్బందితో కుమ్మక్కు కోణంలో దర్యాప్తు
- ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక నిఘా
- ఇప్పటికే రూ.58 లక్షల స్వాధీనం

**అయోధ్య, జూలై 1:** అయోధ్య శ్రీరామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కుంభకోణంలో మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా పాత్రపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి. అరెస్టైన నిందితుల విచారణలో ఆయన పేరు పలుమార్లు ప్రస్తావనకు రావడంతో పాటు, విరాళాల లెక్కింపు ప్రక్రియలో ఆయన కూడా కీలకంగా పాల్గొనేవారని సిట్ అనుమానిస్తోంది. ఈ కేసులో అరెస్టైన నిందితుల్లో ఒకరైన అవినాష్ శుక్లా విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. విరాళాల పెట్టెల నుంచి దొంగిలించిన నగదును ఆలయం వెలుపలికి తరలించే ముందు తాత్కాలికంగా వాష్‌రూమ్‌ల్లో



దాచేవారని అంగీకరించాడు. సీసీటీవీ కెమెరాల స్థానాలపై పూర్తి అవగాహన ఉండటంతో, ఒక వ్యక్తి నగదు తీసుకెళ్తుండగా మిగిలినవారు కెమెరాలకు అడ్డుగా నిలబడి అతడికి రక్షణ కల్పించేవారని వివరించాడు. అనంతరం అవకాశం దొరికినప్పుడు నగదును బయటకు తరలించేవారని వెల్లడించాడు. దర్యాప్తులో మరో కీలక అంశం కూడా బయటపడింది. విరాళాల లెక్కింపు గదికి సంబంధించిన ఒక తాళంచెవి టిన్నూ యాదవ్ వద్ద, మరొకటి బ్యాంక్ సిబ్బంది వద్ద ఉండేదని నిందితులు వెల్లడించారు. ఆలయ సిబ్బందితో పాటు కొందరు బ్యాంక్ ఉద్యోగులు కూడా ఈ అక్రమంలో కుమ్మక్కయ్యారని, దొంగిలించిన సొమ్మును వాటాలుగా పంచుకున్నట్లు సిట్ గుర్తించినట్లు సమాచారం. దొంగిలించిన విరాళాలతో భూములు, ఇళ్లను కొనుగోలు చేసినట్లు నిందితులు అంగీకరించడంతో, వారి ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా ఆస్తుల పెరుగుదలపై కూడా సిట్ విచారణ కొనసాగిస్తోంది. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవకతవకలపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రాతో పాటు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇటీవల తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. సిట్ విచారణ ప్రారంభానికి ముందే పోలీసులు రూ.58 లక్షల నగదును స్వాధీనం చేసుకోగా, ఈ కుంభకోణంలో మరికొందరి పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది.

# బాలికపై 30మంది అఘాయిత్యం

- బలవంతంగా మద్యం తాగించి దారుణం
- రాజస్థాన్‌లో నిందితుల 4 హోటళ్లపై బుల్డోజర్ యాక్షన్
- ఇప్పటివరకు పన్నెండు మంది అరెస్ట్
- బలవంతంగా మద్యం తాగించి దారుణం

**జైపూర్, జులై 1:** రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో 13 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక లైంగికదాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో బాధిత బాలికపై ఐదు రోజుల పాటు 30 మందికి పైగా వ్యక్తులు పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఘటనపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్‌కు దిగింది. కేసుతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నాలుగు హోటళ్లను బుల్డోజర్లతో కూల్చివేసింది. నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హరిశంకర్ హామీ ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. జూన్ 18న ఇంటి నుంచి అదృశ్యమైన బాలికను ఓ ఆటోరిక్షా డ్రైవర్ స్థానిక హోటల్ యజమానికి విక్రయించినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం ఐదు రోజుల పాటు నగరంలోని పలు హోటళ్లకు తరలిస్తూ 30 మందికి పైగా వ్యక్తులు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు





వెల్లడించారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. పలువురు హోటల్ యజమానులు, నిర్వాహకులు కూడా ఈ ఘోరానికి సహకరించడమే కాకుండా.. జరిగిన నేరాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలిక ఇచ్చిన వాంగ్మూలంలో.. నొప్పితో ఏడుస్తుంటే తనకు బలవంతంగా మద్యం తాగించేవారని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 12 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

## ప్రజల్లో ఆగ్రహం.. ఉరిశిక్ష డిమాండ్

ఈ అమానుష ఘటనపై శ్రీగంగానగర్ జిల్లాలో భారీ నిరసనలు కొనసాగుతున్నాయి. నిందితులకు ఉరిశిక్ష విధించాలని, అక్రమంగా నిర్మించిన హోటళ్లన్నింటినీ కూల్చివేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. మరోవైపు స్థానిక కాంగ్రెస్ పార్టీ కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టి.. ఈ ఘటనను అడ్డుకోవడంలో పరిపాలన విఫలమైందని ఆరోపించింది. కేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

# రూ.3 కోట్ల లంచం కేసు..

- ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లావత్ అరెస్ట్

**న్యూఢిల్లీ, జులై 1:** ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లావత్ అరెస్ట్ అయ్యారు. 3 కోట్ల రూపాయల లంచం కేసులో సీబీఐ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. కేసు వివరాలను అధికారులు బుధవారం మీడియాకు వెల్లడించారు. ఆ వివరాల మేరకు.. దీపక్ ఢిల్లీలోని బీసీఏఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. నకిలీ మందుల తయారీ రాకెట్ కేసులో ఆయన 3 కోట్ల రూపాయలు లంచం అడిగినట్లు అధికారులకు తెలిసింది. ఈ నేపథ్యంలోనే దీపక్ నివాసం, కార్యాలయంలో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. డిజిటల్ పరికరాలు, హార్డ్ డిస్క్‌లు, కీలక పత్రాలతో పాటు 90 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మందుల తయారీ కేసులో జూన్ 8వ తేదీన సీబీఐ అధికారులు ఢిల్లీ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ సింగ్, మధ్యవర్తి రాజ్ కుమార్, వ్యాపారవేత్త ఎన్ రాజాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదే రోజు సాయంత్రం సింగ్, రాజ్‌కుమార్‌తో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు. విచారణ సందర్భంగా దీపక్ పేరు వెలుగులోకి వచ్చింది. తన ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి నకిలీ మందుల తయారీ కేసు నుంచి బయటకు తీసుకు వస్తానని దీపక్.. ఎన్ రాజాకు



మాటిచ్చారు. ఇందుకోసం 3 కోట్ల రూపాయలు ఇవ్వమని అడిగారు. అదికూడా 1.5 కోట్ల రూపాయలు ముందుగానే చెల్లించాలని దీపక్ కోరారు. ఏరోసిటీలోని దీపక్ ఆఫీస్‌లో ఈ మేరకు ఓ ఒప్పందం కుదిరింది. దీపక్, ఎన్ రాజాల మధ్య సింగ్ మీడియేటర్‌గా వ్యవహరించాడు. ఎన్ రాజా హవాలా ద్వారా కోటి రూపాయలు సమకూర్చి సింగ్‌కు ఇచ్చాడు. సింగ్ సగం డబ్బులను మరో మీడియేటర్ ప్రభాత్‌కు ఇచ్చాడు. ప్రభాత్ తన ఆఫీస్‌లో 25 లక్షల రూపాయలు ఉంచుకుని మిగితాది వేరే వాళ్లకు ఇచ్చేశాడు. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారులు సింగ్‌తో పాటు రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరి అరెస్ట్‌తో దీపక్ గుట్టురట్టయింది.

# రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

## ఏడుగురి సజీవదహనం

**దౌసా, జులై 1:** రాజస్థాన్‌లో ఈ తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. దౌసా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు, నిలిపి ఉంచిన ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాల్లో మంటలు చెలరేగడంతో ఘటనా స్థలంలోనే ఏడుగురు ప్రయాణికులు సజీవదహనమయ్యారు. స్థానిక సమాచారం ప్రకారం.. బస్సు వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న ట్రక్కును వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు క్షణాల వ్యవధిలోనే బస్సులో భారీగా మంటలు వ్యాపించాయి. ప్రయాణికులు నిద్రమత్తులో ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే మంటలు బస్సు మొత్తాన్ని చుట్టుముట్టాయి. ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. 22 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

# 14,115 కోట్లతో మెగా హైవే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్!

## ప్రధాని మోదీ అధ్యక్షతన కేబినెట్ భేటీ

## భారీ రహదారుల ప్రాజెక్టులకు ఆమోదం

## కోట్ల రూపాయల నిధుల కేటాయింపు

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ (కేబినెట్) సమావేశంలో దేశ మౌలిక వసతుల రంగానికి ఊతమిచ్చేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని సాక్షి ఢిల్లీ ప్రతినిధి ప్రత్యేక కథనంలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ధ్యేయంగా, మెం-త్తం రూ. 14,115 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న రెండు అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. ఇందులో భాగంగా రాజధాని



ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులను శాశ్వతంగా అధిగమించేందుకు మరియు ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు వీలుగా ఢిల్లీ నగరంలో ఒక అత్యాధునిక ఆరు లేన్ల భూగర్భ సొరంగ మార్గం (టన్నల్ రోడ్డు) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ రవాణా ఆధునీకరణ ప్రణాళికలలో భాగంగా ఢిల్లీ పరిధిలోని ప్రముఖ ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవే, నెల్సన్ మండేలా మార్గ్, వసంత్ కుంజ్ ప్రాంతాల మధ్య అత్యంత సులువైన కనెక్టివిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం నిర్మించనున్న ప్రత్యేక టన్నల్ రోడ్డు ప్రాజెక్టు కోసమే కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ. 6,970 కోట్ల భారీ నిధులను కేటాయించింది. ఈ సొరంగ మార్గం అందుబాటులోకి వస్తే రాజధానిలోని అత్యంత రద్దీ ప్రాంతాల మధ్య వాహనాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. దీనితో పాటు ఉత్తర ప్రదేశ్ (యూపీ) రాష్ట్రంలో రవాణా అనుసంధానతను పెంచేందుకు కాన్పూర్ నగరం నుండి కబ్రాయ్ వరకు సరికొత్తగా ఫోర్-లేన్ (4-లేన్ల) యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నిర్మాణానికి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం ప్రకటించింది. ఈ రెండు మెగా ప్రాజెక్టుల ద్వారా ఆయా రాష్ట్రాలలో ఆర్థిక వృద్ధి వేగవంతం కావడమే కాకుండా, పారిశ్రామిక రంగానికి సైతం సరికొత్త ఊపు రానుందని కేంద్ర వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

చురకలు



# వైద్యుల సేవలు అమూల్యం.. డాక్టర్స్ డే సందర్భంగా ఘన సన్మానాలు

**ఆలేరు, జూలై 1 :**




డాక్టర్స్ డే పురస్కరించుకొని బుధవారం ఆలేరు పట్టణంలో ప్రముఖ వైద్యులను వైద్యులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్, భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో వైద్యులకు శాలువాలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలేరు ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ప్రతాప్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వప్న రాథోడ్‌తో పాటు ప్రభుత్వ వైద్యులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు రాత్రింబవళ్లు అంకితభావంతో సేవలందిస్తున్నారని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యుల కృషి ఆదర్శప్రాయమని అన్నారు. అదే సందర్భంగా భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో కూడా డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. సిహెచ్‌ఓ స్వప్న రాథోడ్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ ప్రతాప్ రెడ్డిలను శాలువాలతో సత్కరించి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. వైద్యులు ప్రజల ప్రాణాలను కాపాడే దేవుళ్లతో సమానమని, వారి సేవలను ఎల్లప్పుడూ గౌరవించాలని భజరంగ్ యూత్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు మరియమ్మ, మార్కు యాట శివ, పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్, మల్లెల సరిత శ్రీకాంత్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే భజరంగ్ యూత్ అధ్యక్షుడు సీసా శివ, బరిగె వెంకటేష్, కంసాని మహేష్, రుద్రవీణ సందీప్, మొరిగాడి వివేక్, జూకంటి నవీన్, సిద్ధగొని శ్రవణ్, కందుల శరత్, లక్కాకుల శివ, లక్కాకుల రాకేష్ తదితరులు హాజరయ్యారు.

# బెంగళూరు - హైదరాబాద్ ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

- "పెరిగిన బోర్డింగ్, అలైటింగ్ పాయింట్లు
- బెంగళూరు రూట్లో కొత్త స్టాప్‌లు

**హైదరాబాద్, జూలై 01 :**

బెంగళూరు – హైదరాబాద్ మధ్య ప్రయాణించే ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తీపి కబురు అందించింది. ప్రయాణికుల సౌకర్యాన్ని మరింత పెంపొందించేందుకు, రెండు నగరాల మధ్య నడిచే అన్ని ఏసీ స్లీపర్, నాన్-ఏసీ బస్సులకు బోర్డింగ్, అలైటింగ్ పాయింట్లను భారీగా పెంచినట్లు టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. ప్రయాణికులు తమకు నచ్చిన, దగ్గర్లోని ప్రాంతాల నుంచే సులభంగా బస్సులు ఎక్కేందుకు మరియు దిగేందుకు వీలుగా రూట్లను క్రమబద్ధీకరించారు.బెంగళూరులో బోర్డింగ్ & అలైటింగ్ పాయింట్ల వివరాలు వివిధ రూట్లలో నడిచే బస్సులను బట్టి బెంగళూరు నగరంలో స్టాప్‌ల వివరాలు ఇలా ఉన్నాయి: పీనియా రూట్: పీనియా, యశ్వంతపూర్ మెట్రో స్టేషన్, కెంపెగౌడ బస్ స్టేషన్, హెబ్బల్, ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్. అలాగే చందాపూర్ రూట్ : చందాపూర్, బొమ్మసంద్ర, ఎలక్ట్రానిక్ సిటీ, బొమ్మనహళ్లి మెట్రో స్టేషన్, మడివాళ, కెంపెగౌడ బస్ స్టేషన్, హెబ్బల్ & ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్.

**మార్తహళ్లి రూట్:** వర్తూర్ జంక్షన్, మార్తహళ్లి, దొమ్మూరు బ్రిడ్జి, కెంపెగౌడ బస్ స్టేషన్, హెబ్బల్ & ఎస్టీమ్ మాల్, ఎలాహంక, బెంగళూరు ఎయిర్ పోర్ట్ టోల్ ప్లాజా, దేవనహళ్లి బైపాస్.

**"హైదరాబాద్‌లో బోర్డింగ్ & అలైటింగ్ పాయింట్ల వివరాలు :"**

బెంగళూరు నుంచి హైదరాబాద్ వచ్చే అన్ని సర్వీసుల ప్రయాణికుల కోసం నగరంలోని ప్రధాన మార్గాల్లో కింది విధంగా స్టాప్‌లు అందుబాటులో ఉంటాయి : పటాన్‌చెరు రూట్ : పటాన్‌చెరు నుండి ఎంజీబీఎస్, ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన స్టేజీలలో..

**జేబీఎస్ రూట్:** జేబీఎస్ నుండి ఎంజీబీఎస్, ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన స్టేజీలలో..

**హయత్ నగర్ రూట్:** హయత్ నగర్ నుండి ఎంజీబీఎస్, ఆరాంఘర్, శంషాబాద్ వరకు ఉన్న అన్ని ప్రధాన స్టేజీలలో బోర్డింగ్/అలైటింగ్ పాయింట్లు కలవు. టీజీఎస్ ఆర్టీసీ కల్పించిన ఈ అద్భుతమైన సదవకాశాన్ని బెంగళూరు – హైదరాబాద్ మధ్య ప్రయాణించే ప్రయాణికులందరూ వినియోగించుకోవాలని సంస్థ కోరుతోంది. మీ ఇంటికి దగ్గరలోనే బోర్డింగ్ పాయింట్లను ఎంచుకుని, సురక్షితమైన మరియు సుఖవంతమైన ప్రయాణాన్ని ఆస్వాదించాలని యాజమాన్యం సూచించింది.

# విద్యతోనే ఉన్నత భవిష్యత్ – జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రఘునాథ్ పల్లి జులై1:.**

జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని కేజీబీవీ, ఖిలాషాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి అన్ అకాడమీ తరగతులను ప్రారంభించిన ఆయన, గణితంలో సులభ పద్ధతుల్లో లెక్కలు నేర్పించారు. విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యమవుతుందని, బాగా చదివి మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

తరగతి గదులు, పఠన సామర్థ్యాలు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాల పెంపుతో పాటు విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

# శ్రీ కృష్ణ మదర్ డైరీ పాల సంఘం చైర్మన్‌గా పంతం కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక

పంతం కృష్ణ ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు




**ఆలేరు, జూలై 1 :**

ఆలేరు పట్టణంలోని శ్రీ కృష్ణ మదర్ డైరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన చైర్మన్‌గా పంతం కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులందరి ఏకాభిప్రాయంతో ఆయనను చైర్మన్‌గా ఎన్నుకోగా, డైరెక్టర్లుగా పూల మహేందర్, దూడల సురేష్ గౌడ్, కోనాపురం సుధీర్ కుమార్ ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గం ఎన్నిక సందర్భంగా సంఘం సభ్యులు చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తూ, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని నూతన చైర్మన్ పంతం కృష్ణ తెలిపారు. పాల ఉత్పత్తి రంగాన్ని మరింత అభివృద్ధి చేసేలా సభ్యుల సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ సాంబిరెడ్డి, జూకంటి శంకర్, మొరిగాడి అశోక్ గౌడ్, గాండ్ల చంద్రయ్య, ఎలగాల శివతో పాటు పాల ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు, రైతులు, స్థానిక ప్రముఖులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# "ఆపరేషన్ ముస్కాన్-XII" ప్రారంభం

- ఐదేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ, బాలుడిని సురక్షితంగా రక్షించిన వికారాబాద్ పోలీస్!
- అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్.

**వికారాబాద్, జులై,01**




బాలల సంరక్షణ, హక్కుల రక్షణే ధ్యేయంగా జూలై 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా "ఆపరేషన్ ముస్కాన్–XII" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ తెలిపారు. ఈ ఆపరేషన్ ప్రారంభం రోజే వికారాబాద్ పోలీసులు పట్టుదలతో శ్రమించి, సరిహద్దులు దాటి మరీ ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న ఒక క్లిష్టమైన 'మహిళ మరియు బాలుడి మిస్సింగ్' కేసును ఛేదించి ముస్కాన్ కార్యక్రమానికి అత్యుత్తమ ఆరంభాన్ని ఇచ్చారు.గత 2020 సంవత్సరంలో నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ, చిన్నారి బాలుడు అదృశ్యమయ్యారు. ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో ఇది "లాంగ్ పెండింగ్" కేసుగా మిగిలిపోయింది. ఇటీవల ఎస్పీ ఆదేశాలతో నవాబ్ పేట్ పోలీసులు అత్యాధునిక సాంకేతిక ఆధారాలను (కాల్ డేటా, ఆధార్ లింక్ లు) క్షుణ్ణంగా విశ్లేషించారు.లభించిన ఆధారాలతో వికారాబాద్ డి ఎస్ పి అంజయ్య పర్యవేక్షణలో మోమిన్ పేట్ సి ఐ, జి. వెంకట్, నవాబ్ పేట్ ఎస్సై గిరి ల యొక్క సూచనల మేరకు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం ఆంధ్రప్రదేశ్ లోని మునగపాక పోలీస్ స్టేషన్ పరిధికి చేరుకుని, సుదీర్ఘ గాలింపు చర్యల అనంతరం ఆ మహిళను, బాలుడిని సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు.టెక్నాలజీని వాడుకుని చాకచక్యంగా ఈ కేసును ఛేదించిన మోమిన్ పేట్ సి ఐ జి. వెంకట్, నవాబ్ పేట్ ఎస్సై గిరి, సిబ్బంది సాయి కుమార్, మహేందర్ గౌడ్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఇట్టి సంధార్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "మహిళలు, పిల్లల భద్రత విషయంలో వికారాబాద్ పోలీస్ శాఖ ఎప్పుడూ రాజీ పడదు.బుధవారం నుండి ప్రారంభమైన 'ఆపరేషన్ ముస్కాన్–XII' లో భాగంగా తప్పిపోయిన, భిక్షాటన చేస్తున్న మరియు బాల కార్మికులుగా మారిన పిల్లలను రక్షించి వారి కుటుంబాలకు అప్పగించడమే మా ప్రాధాన్యత. దీనికోసం సబ్ డివిజన్ల వారీగా పోలీస్ అధికారులు మరియు సంబంధిత అధికారులతో కలసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి వికారాబాద్ జిల్లాను "బాల కార్మిక రహిత" జిల్లాగా మార్చాలి" అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ పిలుపునిచ్చారు.

# వీబీజీ రాంజీ పథకం రద్దు చేయాలని సీఐటీయూ నిరసన



**కురవి జూలై1**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని తట్టుపల్లి, చంద్యా తండా గ్రామ పంచాయతీ కార్యాలయాల ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేసి, 2006లో ప్రారంభించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ పనిదినాలను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని కోరారు. పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం, కూలీలకు వారానికోసారి వేతనాలు చెల్లించడం, మేట్లకు భత్యాలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు భూమిలేని కూలీలకు "ఆత్మీయ భరోసా" కింద రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దీకొండ రవీందర్, బొడ్డు శ్రీను, యాసారపు మురళి, అంతటి ఉపేందర్, నల్ల శంకర్, రాజు, వెంకన్న, గాలి చిన్న సైదులు, సగ్గం రామస్వామి, సైదులు, వనం రమేష్, సరిత, శాంత, సైది అంబ, నీల, పీటీ బాజు, శంకర్, మదర్ సరోజ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ-ఏ కేటగిరీలోని కొన్ని కులాల పేర్ల మార్పు



**మహబూబాబాద్, జూలై 1::**

తెలంగాణ ప్రభుత్వం బీసీ–ఏ కేటగిరీలోని కొన్ని కులాల పేర్లను మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయి శ్రీజ తెలిపారు.

**మార్చిన పేర్లు ఇవి:**

బుడ బుక్కల → శివ క్షత్రియ, దొమ్మర → గద వంశీయ, పెన్నార్ → దోభీ (చాకలి రజకులు), పిచ్చిగుంట్ల → వంశరాజ్, వీరముష్టి → నెట్టికోటల, వీరభద్రీయ, సంబంధిత కులాల వినతులు, సామాజిక పరిస్థితులు, గౌరవప్రదమైన గుర్తింపు అవసరాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై అన్ని ప్రభుత్వ రికార్డులు, కుల ధృవీకరణ పత్రాలు, విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలలో కొత్త పేర్లనే నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రజలు, కుల సంఘాల నాయకులు స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలోనూ ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక కేటాయింపులు



**హైదరాబాద్, జూలై 1:**

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీ, గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకంగా అదనపు ఇళ్లను కేటాయించాలని మంత్రి సీతక్క నేతృత్వంలోని ఆదివాసీ, గిరిజన ఎమ్మెల్యేలు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మొదటి విడతలో ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేకంగా 1,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినందుకు మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇప్పటికీ అనేక గిరిజన కుటుంబాలు గుడిసెల్లోనే నివసిస్తున్నాయని, భౌగోళిక, ఆర్థిక ఇబ్బందుల కారణంగా శాశ్వత గృహాలు నిర్మించుకోలేకపోతున్నాయని వివరించారు. రెండో విడతలో కూడా సాధారణ ప్రాంతాల కంటే అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను ఏజెన్సీ ప్రాంతాలకు కేటాయించాలని కోరగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

# ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో సాతవాహన ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక నిలుపుదల

**సింద్రాబాద్ జులై1:**

భక్తుల సౌకర్యార్థం జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా జూలై 1 నుంచి 3, 2026 వరకు దక్షిణ మధ్య రైల్వే ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో సాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా నిలుపుదల కల్పించింది. రైలు నెం. 12713 (విజయవాడ–సికింద్రాబాద్–విజయవాడ సాతవాహన ఎక్స్‌ప్రెస్) ఎర్రుపాలెం చేరిక: ఉదయం 7:05 గంటలకు బయలుదేరు: ఉదయం 7:06 గంటలకు రైలు నెం. 12714 ఎర్రుపాలెం చేరిక: రాత్రి 9:22 గంటలకు బయలుదేరు: రాత్రి 9:23 గంటలకు దేవాలయ ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక తాత్కాలిక నిలుపుదలను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది..

చురకలు



## ఆపరేషన్ అమానత్‌తో రూ.2.24 కోట్ల పోగొట్టుకున్న వస్తువులు అప్పగింపు



**సికింద్రాబాద్ జులై 1:.**

సికింద్రాబాద్ రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) 'ఆపరేషన్ అమానత్' ద్వారా 2026 జనవరి నుంచి జూన్ వరకు 658 కేసులను పరిష్కరించి రూ.2.24 కోట్ల విలువైన పోగొట్టుకున్న ప్రయాణికుల వస్తువులను యజమానులకు తిరిగి అందించింది. 2024 జనవరి నుంచి 2026 జూన్ వరకు మొత్తం 2,747 కేసుల్లో రూ.7.28 కోట్ల విలువైన ఆస్తులను రికవరీ చేసి అప్పగించింది. 700కు పైగా సీసీటీవీ కెమెరాల నిఘా, ప్రయాణికుల వివరాల ఆధారంగా వేగవంతమైన గుర్తింపు, పారదర్శక ధృవీకరణ ప్రక్రియతో ఈ విజయాన్ని సాధించినట్లు సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అలకుంట నవీన్ కుమార్ తెలిపారు. ప్రయాణంలో వస్తువులు పోగొట్టుకుంటే వెంటనే 139 హెల్ప్‌లైన్కు ఫోన్ చేయాలని లేదా సమీప ఆర్‌పీఎఫ్ పోస్టును సంప్రదించాలని అధికారులు సూచించారు.

## రోగులకు మెరుగైన సేవలు అందించండి:

### జిల్లా డిఎమ్ హెచ్ఓ డాక్టర్.సుధాకర్ లాల్




**దౌల్తాబాద్ మండలం, జులై,01**

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ప్రజలకు వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్ లాల్ అన్నారు బుధవారం దౌల్తాబాద్ PHC నీ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ,, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు PHC లో అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు PHC లో OP సేవలు పెరిగాయని సిబ్బందిని అభినందించారు త్వరలోనే ఇది 24 గంటల PHC గా అప్ గ్రేడ్ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని, డాక్టర్ సౌమ్య, డాక్టర్ స్నేహ, డాక్టర్ రామకృష్ణ మరియు సూపర్ వైజర్ రఫీ మరియు PHC సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీఐ, ఏటీసీ ప్రవేశాలకు దరఖాస్తుల గడువు జూలై 10 వరకు పొడిగింపు

**జగిత్యాల జూలై 1:.**

జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు)లో 2026–27 విద్యా సంవత్సరం ఆగస్టు సెషన్ తొలి విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును జూలై 10 వరకు పొడిగించినట్లు జగిత్యాల ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ ప్రిన్సిపాల్, కన్వీనర్ జి. రవీందర్ తెలిపారు. ఈ పొడిగింపును అధికారిక ప్రవేశాల పోర్టల్ కూడా ప్రకటించింది.

**అర్హతలు**

పదో తరగతి ఉత్తీర్ణులు 2026 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు

అభ్యర్థులు తెలంగాణ ఐటీఐ ప్రవేశాల అధికారిక వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎస్ఎస్సీ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, బోనాఫైడ్, టీసీ తదితర ఒరిజినల్ పత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు సమయంలో నమోదు చేసే మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీని కోర్సు పూర్తయ్యే వరకు మార్చవద్దని సూచించారు. అభ్యర్థులు తమకు నచ్చిన కోర్సులను ఎక్కువ సంఖ్యలో ఆప్షన్లుగా ఎంపిక చేసుకోవచ్చు.

**జగిత్యాల ఏటీసీలో అందుబాటులో ఉన్న కోర్సులు**

మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్

ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ఆ ర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్డ్ టూల్స్బ సిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్స్ ఎన్‌సీ మెషిన్ టెక్నీషియన్మె ,కానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ప్ర భుత్వ ఐటీఐలో ఎలక్ట్రిషియన్ ట్రేడ్ కూడా అందుబాటులో ఉంది. సీటు కేటాయింపు పొందిన అభ్యర్థులకు నమోదైన మొబైల్ నంబర్‌కు సందేశం పంపిస్తారు. మరిన్ని వివరాలకు 8500463301, 8500463313, 9666222621 నంబర్లను సంప్రదించవచ్చు.

## తెలంగాణ విలేకరులకు ఊరట.

### అక్రిడిటేషన్ గడువు జూలై 22 వరకు పొడిగింపు.

**హైదరాబాద్, జూలై 1::.**

తెలంగాణ రాష్ట్రంలోని రాష్ట్ర, జిల్లా విలేకరులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. 2026–2028 కాలానికి కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, 2024–2026 కాలానికి జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువును ఈ నెల 22వ తేదీ వరకు పొడిగిస్తూ సమాచార & పౌరసంబంధాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ ఇంకా పూర్తికాకపోవడంతో, ప్రస్తుతం ఉన్న పాత అక్రిడిటేషన్ కార్డులు 2026 జూలై 22 వరకు చెల్లుబాటు కానున్నాయి. అలాగే, ఆయా కార్డుల ఆధారంగా జారీ చేసిన టీజీఎస్ఆర్టీసీ బస్ పాస్‌లు కూడా జూలై 1 నుంచి జూలై 22 వరకు అమల్లో ఉంటాయి. కొత్త అక్రిడిటేషన్ కార్డులు అందే వరకు పాత కార్డుల ఆధారంగానే బస్ పాస్ సౌకర్యాన్ని కొనసాగించాలని టీజీఎస్ఆర్టీసీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అవసరమైతే దీనికి మరింత ఆకర్షణీయమైన ఉపశీర్షిక లేదా బాక్స్ ఐటమ్ (ముఖ్యాంశాలు) కూడా సిద్ధం చేస్తాను.

# డబుల్ బెడ్‌రూం, మార్కండేయ కాలనీలకు ఊరట

- తాగునీటి సరఫరా పునరుద్ధరణ
- నూతన మోటర్ ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

**ఆలేరు, జూలై1 :**

ఆలేరు పట్టణంలోని డబుల్ బెడ్‌రూం, మార్కండేయ కాలనీల్లో చాలా కాలంగా నెలకొన్న తాగునీటి సమస్యకు మున్సిపాలిటి ముగింపు పలికారు. నీటి సరఫరా సరిగా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. స్థానికంగా అందుబాటులో ఉన్న బోరును లీజుకు తీసుకుని, దానికి నూతన మోటారును ఏర్పాటు చేసి కాలనీలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించారు.



దీంతో పలురోజులుగా నీటి కోసం అవస్థలు పడుతున్న డబుల్ బెడ్‌రూం, మార్కండేయ కాలనీ ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పట్టణంలో ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరం అందించే దిశగా అవసరమైన చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు వెంటనే స్పందించి పరిష్కారం చూపిన మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మున్సిపల్ పాలకవర్గం, అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు పస్తం ఆంజనేయులు, పాషికంటి సంపత్, జూకంటి సంపత్, ఆలేరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ రెడ్డి, సంబంధిత అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం: డీఎస్పీ నల్లపు లింగయ్య

### 180 ఇళ్లలో తనిఖీలు పత్రాలు లేని 55 వాహనాలు సీజ్

**నారాయణపేట, జులై01 :**





కొత్త వ్యక్తుల కదలికలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, సీసీ కెమెరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన. నారాయణపేట: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం లక్ష్యంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని భీమండి కాలనీలో బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం (కార్డెన్ అండ్ సెర్చ్) నిర్వహించినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 75 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని కాలనీలోని 180 ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 2 కార్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.అదేవిధంగా కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని వివరించారు. కొత్త వ్యక్తులు కాలనీలో నివాసం ఉంటే వారి వివరాలను స్థానిక పోలీసులకు తెలియజేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్–100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ప్రజల భద్రత కోసం ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండే విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ... జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాములను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీసులతో సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. కాలనీల్లో అద్దెకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలను గృహ యజమానులు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. అనుమానాస్పద కదలికలు, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించి వాహనాల సంబంధిత పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ శివ శంకర్,ఎస్సె లు ఏం వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, నరేష్, కృష్ణ చైతన్య, గాయత్రి, పోలీసు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కోతుల బెడదకు చెక్: మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు

### కోతులు పట్టే వారితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

**ఆలేరు, జూలై 1 :**

ఆలేరు పట్టణంలో చాలా సంవత్సరాలుగా ప్రజలు, వ్యాపారులు, ప్రయాణికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న కోతుల సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ప్రత్యేక బృందాల సహాయంతో ఆలేరు పట్టణంలో కోతులను పట్టించి అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.



పట్టణంలోని కాలనీలు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో కోతుల సంచారం అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులపై దాడులు చేయడం, ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, వ్యాపార సంస్థలకు నష్టం కలిగించడం వంటి సమస్యలు తరచూ చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మున్సిపాలిటీ ఈ చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగానే కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తూ పట్టణంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మరియమ్మ, మార్కు యాట శివ, పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్, మల్లెల సరిత శ్రీకాంత్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు స్థిర ఆదాయం

### ప్రభుత్వ విప్ విజయరమణారావు

**పెద్దపల్లి, జూలై 1::**

ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఎకరాకు రూ.3 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని, రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో తక్కువ నీటితో పండే పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించిన ఆయన, ప్రభుత్వం తక్కువ ధరకు ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తోందని, నాలుగేళ్ల తర్వాత అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ మధ్యకాలంలో అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, శివపల్లిలో ఒకేసారి 120 ఎకరాల్లో ఆయిల్‌పామ్ నాటడం అభినందనీయమన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తోందని, శ్రీరాంపూర్‌లో ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు డ్రిప్, మొక్కలు, బోర్లు, విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటులో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం



అందిస్తుందని తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు జిల్లాలో నిషేధం.

**నారాయణపేట, జులై,01**

శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 30 పోలీస్ ఆక్ట్ జులై 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి



కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## ఏసిపి మధుసూదన్ రెడ్డిని కలిసిన శ్రీనివాస్ గౌడ్.

**వలిగొండ జూలై 01**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డిని వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ మంగళవారం చౌటుప్పల్ లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏసిపి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా నిరంతరం కృషి చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా వారన్నారు.

# పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- **నాణ్యమైన దర్యాప్తు, ప్రజాకేంద్రీకృత పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి**




**మరిపెడ,జూలై1 :**

మహబూబాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డా.శబరీష్,ఐపీఎస్ బుధవారం మరిపెడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లోని రికార్డులు,సీడీ ఫైళ్లు,పెండింగ్ కేసులు,దర్యాప్తు పురోగతి, వివిధ విభాగాలు,మౌలిక సదుపాయాలు,పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మరిపెడ ఎస్ఐతో సమావేశమై పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న ఫైళ్లు,విచారణ నివేదికల తయారీ,వాటి నాణ్యత, సమయపాలనపై సమీక్షనిర్వహించారు.ప్రతి కేసులో చట్టపరమైననిబంధనలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలనిఆదేశించారు.కేసుల విచారణ నివేదికలను సమగ్రంగా, వాస్తవాధారాలతో సిద్ధం చేయాలని,ఫైళ్ల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బంది,విలేజ్ పోలీస్ ఆఫీసర్లతో సమావేశమైన జిల్లా ఎస్పీ గ్రామాల్లో ప్రజలతో నిరంతర సంబం ధాలు కొనసాగించాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నివారణ,సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహ న క ల్పించ డ ం, అ నుమానాస్పద వ్యక్తులు,చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారాన్ని సకాలంలో సేకరించి పోలీసులకు అందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితోమర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో,పారదర్శకంగా,ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని,మహిళలు,చిన్నారులు,వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక ప్రాధాన్యతతో స్పందించాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాలు,మహిళలపై నేరాలు,మాదక ద్రవ్యాల అక్రమ రవాణా,ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలపై అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

# కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వికారాబాద్ జిల్లా ఎస్పీ

**కుల్కచర్ల మండలం, జులై,01**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ బుధవారం కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె స్టేషన్ పరిసరాలను, పరిపాలనా గదిని, రికార్డు రూమ్‌లను స్వయంగా పరిశీలించారు. స్టేషన్‌లో ఉన్న పాత రికార్డులను, పెండింగ్ ఫైళ్లను తనిఖీ చేసిన ఎస్పీ, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి పెండింగ్ ఫైళ్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఇట్టి కార్యక్రమం లో ఎస్పీ మాట్లాడుతూ,, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, వారి సమస్యలను ఓపికగా విని తక్షణమే స్పందించాలని ఎస్పీ సూచించారు. బాధితులకు నమ్మకం కలిగేలా, పోలీసు సేవలు పూర్తి పారదర్శకంగా (Transparent) ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల పోలీస్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాల నివారణకు గానూ రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను (నైట్ గస్తీ) మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, బాలల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారిపై జరిగే అన్యాయాలు, నేరాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఆలస్యం చేయకుండా తక్షణమే ఆన్-సైట్ (On-site) FIR లు నమోదు చేయాలని ఆదేశించారు.మహిళల,పిల్లల భద్రత కోసం ప్రవేశపెట్టిన 'సురక్ష మిత్ర' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు తగిన వాలంటీర్లను త్వరగా గుర్తించి వారిని యాక్టివేట్ చేయాలన్నారు. నేరాల పరిశోధనలో సాంకేతికత వినియోగం పెరగాలని,



అందుకోసం 'ఈ-సాక్ష్య' విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అలాగే, నేరాల నియంత్రణలో మరియు నిందితులను పట్టుకోవడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమైనదని, అందువల్ల 'నిఘా నేత్రం' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో సీసీటీవీల ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ స్నేహ మెహ్రా ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.ఇట్టి కార్యక్రమం లో పరిగి డిఎస్పి శ్రీనివాస్, పరిగి సిఐ కొండల్ రెడ్డి, కుల్కచెర్ల ఎస్సై రమేశ్ కుమార్,పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది,

# ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష సామాజిక తనిఖీ విజయవంతం

**మరిపెడ,జూలై1 :**

మరిపెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్ బుధవారం విజయవంతంగా నిర్వహించారు. సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ ఆధ్వర్యంలో గాదెగాని అరుణ పర్యవేక్షణలో ఈ తనిఖీ చేపట్టారు.ఈ సందర్భంగా పాఠశాల పరిపాలనా రికార్డులు,ప్రభుత్వ గ్రాంట్ల వినియోగం, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు.అలాగే విద్యార్థుల నమోదు,ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు,మధ్యాహ్న భోజన పథకం అమలు,విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ,మరుగుదొడ్ల నిర్వహణ,ఆట స్థలం,గ్రంథాలయం,విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల,డిజిటల్ బోధన, బోధనోపకరణాల వినియోగం,విద్యా ప్రమాణాలు,పాఠశాల నిర్వహణ కమిటీ పనితీరుపై సమగ్రంగా సామాజిక తనిఖీ నిర్వహించారు.తనిఖీ సందర్భంగా సామాజిక వర్గాల ప్రతినిధులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల నిర్వహణ,బోధన,సౌకర్యాలు, ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం సామాజిక తనిఖీ బృందం పాఠశాల నిర్వహణ,విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత,విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు,ఉపాధ్యాయుల సేవల పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసింది.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలసమర్థవంతంగానిర్వహించబడుతోందనిప్రశంసించింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు,ఉపాధ్యాయ బృందం,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## నిర్ణీత గడువులోపు ఓటరు గణన పూర్తి చేయాలి:

**కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, జూలై 1:.**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్ణీత గడువులోపు పారదర్శకంగా పూర్తి చేయాలని, రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు మాత్రమే ఇంటింటికి వెళ్లి ఓటరు గణన ఫారాలు పంపిణీ చేసి వివరాలు సేకరిస్తారని, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు ఫారాల పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి ఓటరు గణన కొనసాగుతుందని, జూలై 24లోపు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, సవరణల దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

# విద్యార్థుల నమోదు, హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి:



కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్ జూలై1:.**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు, నాణ్యమైన బోధన, మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించి నాణ్యమైన బోధన అందించాలని, 'బడిబాట' కార్యక్రమం ద్వారా నమోదు లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. అపార్ ఐడీ, ఆధార్ సీడింగ్, బయోమెట్రిక్ నమోదు, ఫేస్ రికగ్నిషన్ హాజరు, ఎఫ్ఎల్ఎన్, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, తక్కువ హాజరు ఉన్న మండలాల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఎంఈఓ నెలకు కనీసం 16, ప్రతి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు 12 పాఠశాలలను తనిఖీ చేయాలని సూచించారు. కేజీబీవీలు, పీఎం శ్రీ పాఠశాలల్లో పెండింగ్ నిర్మాణాలు, మరమ్మతులను రెండు నుంచి మూడు వారాల్లో పూర్తి చేయాలని, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను ఆలస్యం చేయకుండా విద్యార్థులకు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు

**ధన్యవాదాలు తెలిపిన యాలాల పోలీసులు**

**యాలాల , జూలై1:**

యాలాల గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయుటకు గ్రామ సర్పంచ్ శివయ్య మొత్తం 30 కెమెరాలకు గాను 2,15,000/-రూపాయలు అవసరం కాగా దానికి ఒక లక్ష రూపాయలను బుధవారం విరాళంగా ఇవ్వడం జరిగింది. గ్రామం యొక్క భద్రతను దృష్టిలో పెట్టుకొని సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు వచ్చినటువంటి యాలాల గ్రామ సర్పంచ్ మరియు గ్రామ వాసులకు ధన్యవాదాలు తెలిపిన యాలాల పోలీస్ లు.

## రాజకీయ పార్టీల సహకారంతో ఓటర్ల జాబితా సవరణ విజయవంతం చేయాలి: కలెక్టర్



**ఆదిలాబాద్, జూలై 1:.**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయడంతో పాటు, జాబితాలోని తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపులో రాజకీయ పార్టీలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావు తదితర అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూలై 1:**



రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. మామడ మండలం పరిమండల్ గ్రామంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటి రైతులతో కలిసి పంటను పరిశీలించారు. ఆయిల్ పామ్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు పండించిన దిగుబడికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ పంట ద్వారా అధిక లాభాలు పొందవచ్చని, అంతర పంటల సాగు కూడా చేయవచ్చని చెప్పారు. అవసరానికి మించి ఎరువులు వాడకుండా నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమణ, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారాల్లో వివరాలు పక్కాగా నమోదు చేయాలి:

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల, జూలై 1:**

ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ఎన్యూమరేషన్ ఫారాల్లో వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. బుధవారం సిరిసిల్ల పట్టణం 33వ వార్డులోని 163, 164, 166 పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆమె, బీఎల్ఓలు ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయం చేయడంతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను సేకరించాలని ఆదేశించారు. ఫారాల్లోని వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ కూలీ రేట్లు పెంపు.. కనీస వేతనం రూ.300

**న్యూఢిల్లీ, జూలై 1:.**

కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం–2025 కింద దేశవ్యాప్తంగా గ్రామీణ ఉపాధి కూలీ రేట్లను సవరించింది. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ కొత్త రేట్ల ప్రకారం ఏ రాష్ట్రంలోనూ రోజువారీ కూలీ రూ.300 కంటే తక్కువ ఉండదు. దేశవ్యాప్తంగా సగటు కూలీ రేటు రూ.298.8 నుంచి రూ.327.4కు పెరిగి, సగటున 10 శాతానికి పైగా పెరుగుదల నమోదైంది. Press Information Bureau +1 చారిత్రకంగా తక్కువ కూలీ రేట్లు ఉన్న రాష్ట్రాలకు అత్యధిక ప్రయోజనం కల్పించారు. ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో 15 నుంచి 25 శాతం వరకు పెంపు ఉండగా, హర్యానా (రూ.409), గోవా (రూ.406), కేరళ (రూ.401) వంటి రాష్ట్రాల్లో రోజువారీ కూలీ రూ.400కు పైగా నిర్ణయించారు. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొత్తగా రూ.300 కనీస వేతనం అమల్లోకి వచ్చింది. మిలియన్ల గ్రామీణ కార్మికుల జీవనోపాధి బలోపేతం చేయడం, ప్రాంతాల మధ్య వేతన అసమానతలను తగ్గించడం ఈ నిర్ణయం లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది.

## భూ భారతి, ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి:

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, జూలై 1:.**

పారదర్శకత, జవాబుదారీతనంతో రెవెన్యూ పాలనను అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తహసీల్దారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భూ భారతి, సాదా బైనామా, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. భూ భారతి పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, వారసత్వ హక్కులు, సర్వే నంబర్ల వారీగా భూ రికార్డులను ధృవీకరించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులను సంబంధిత పత్రాలు, గ్రామ రికార్డుల ఆధారంగా జాప్యం లేకుండా పరిష్కరించాలని, ప్రజావాణి పెండింగ్ వినతులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ అవసరాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని సూచించారు.

## పోలబోయిన లింగస్వామి రెండోసారి ఏకగ్రీవంగాఎన్నిక.

**వలిగొండ జూలై 01**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజుపల్లి పాల ఉత్పద్దారుల సహకార సంఘం చైర్మన్ గా పోలబోయిన లింగస్వామి రెండోసారి డైరెక్టర్లు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని సంఘ అభివృద్ధికి పాల ఉత్పత్తి దారులకు సంక్షేమ కోసం సమిష్టిగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు. పాల సంఘం డైరెక్టర్లు గా ఏనుగుల ఐలయ్య, ఎనుగుల రాములు, నల్లబోలు యాదయ్య, ఏనుగుల మల్లయ్య, పాశం వెంకట్ రెడ్డి, పుల్లగుర్ల నర్సిరెడ్డి, ఏనుగుల మత్స్యగిరి, తోంట మైసయ్య, పోలబోయిన శేఖర్, సంగపాక స్వామి (సెక్రెటరీ) ఎన్నికయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు రైతులు సంఘం సభ్యులు గ్రామ పెద్దలు చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా ఎస్పీని కలిసిన ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ ఆర్.రామ్మోహన్

**నారాయణపేట,జులై,01**



నారాయణపేట ఆర్టీసీ బస్ డిపోకు నూతనంగా డిపో మేనేజర్‌గా వచ్చిన ఆర్. రామ్మోహన్ బుధవారం నాడు నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందచేశారు. అనంతరం జిల్లా ఎస్పీ డిపో మేనేజర్‌కు అభినందనలు తెలియజేస్తూ, ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలు అందించడంలో పోలీసు శాఖ–ఆర్టీసీ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## వెంకటాపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి



**వలిగొండ జూలై 01**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వెంకటపురం గ్రామంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం 8 గంటలకు హోమం మరియు బలిహరణ పూర్ణాహుతి నిర్వహించడమైనది ఆలయ కార్యనిర్వాహన అధికారి కొత్తపల్లి వెంకటయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ కార్యక్రమంలో వలిగొండ మండల తహసిల్దార్ దశరథ స్థానిక సర్పంచ్ కర్నెకంటి కళ్ళమ్మ యాదయ్య గ్రామ ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్స్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల సేవలు సమాజానికి అమూల్యం

### పీహెచ్‌సీలో ఘనంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం

**మరిపెడ,జూలై1 :**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీ లో బుధవారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రజారోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న వైద్యాధికారులను ఈ సందర్భంగా వైద్య సిబ్బంది,వాసవి క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు డాక్టర్ గుగులోతు రవి,డాక్టర్ కిరణ్ సాగర్ లకు శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు.వాసవి క్లబ్ సభ్యులు డాక్టర్ రవి అందిస్తున్న సేవలను కొనియాడుతూ.. ప్రత్యేకంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత ప్రజలకు కోవిడ్ కాలం నుంచి నేటి వరకు వైద్యులు అంకితభావంతో సేవలందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.వైద్య వృత్తి సేవా దృక్పథానికి ప్రతీక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ,హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి కుమారి,స్టాఫ్ నర్సులు పద్మ,సుజాత,రత్నకుమారి, పల్లె దవాఖాన సిబ్బంది ఝాన్సీ, అఖిల,సరిత,సౌజన్య, అనిత, ఏఎన్ఎంలు మంజువాణి,ఝాన్సీ, లలిత,నాగమణి,విజయ,కీర్తి,స్వప్న, తులసి,రాములమ్మ,హుస్సేన్ బీ, హరీశ,శ్రీదేవి,శ్రీలత,రోజమణి,ఆశా కార్యకర్తలు ఆశియా,అనురాధతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలి

- ఏఐకేఎంఎస్
- జాయింట్ కలెక్టర్కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**ఆలేరు, జూలై 1 :**



కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేస్తున్న వీబీజీ రామ్‌జీ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకుని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు బుధవారం భువనగిరి కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు జిల్లా నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం వీబీజీ రామ్‌జీ పేరుతో కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీలను పథకం నుంచి దూరం చేసేందుకు సాంకేతిక నిబంధనలను అడ్డంకులుగా మారుస్తోందని విమర్శించారు. ఉపాధి పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచుతున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వ్యవసాయ పనుల పేరుతో సంవత్సరంలో సుమారు 60 రోజుల పాటు ఉపాధి పనులు నిలిపివేస్తే ఆ పెంపు వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. వీబీజీ రామ్‌జీ పథకాన్ని ఉపసంహరించకపోతే ఉపాధి హామీ కూలీలు, రైతులు, ప్రజా సంఘాలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ లు మాట్లాడుతూ రైతుల సంక్షేమం గురించి మాట్లాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరాలో విఫలమయ్యాయని విమర్శించారు. యూరియా కొనుగోలుకు తీసుకొచ్చిన యాప్ కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ విధానాన్ని ఉపసంహరించాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు మామిడాల సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు చిరబోయిన రాజయ్య లు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన రూ.2 లక్షల రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. రైతు భరోసా పథకం అమలులోనూ జాప్యం జరుగుతోందని, పెండింగ్‌లో ఉన్న పాల రైతుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇక్కిరి సహదేవ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పద్మ సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడాల బాలమల్లేష్, జిల్లా సహాయ కార్యదర్శి తమ్మడి అంజయ్య, జిల్లా నాయకులు తమ్మడి రమేష్, వంగాల మధుసూదన్ రెడ్డి, కడకంచి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్.. విద్యార్థులకు గణితం బోధన

**హనుమకొండ, జూలై 1::.**



హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు స్వయంగా గణితం బోధించారు. ఐదో తరగతి విద్యార్థులతో బ్లాక్‌బోర్డుపై లెక్కలు రాయించి వారి అవగాహన, నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా మారాలని, విద్యార్థుల్లో పఠన సామర్థ్యం, గణిత నైపుణ్యాలు, ఆలోచనా శక్తి పెంపొందేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణితంలో నైపుణ్యం సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. పాఠశాలలో తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనశాలను పరిశీలించిన కలెక్టర్ అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పంపిణీని పరిశీలించారు. వనమహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. తర్వాత గ్రామంలోని డంపింగ్ యార్డ్, నర్సరీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చింతకుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డాక్టర్ సేవలకు ఘన సన్మానం




### డాక్టర్స్ డే సందర్భంగా డా మురహారికి అభినందనలు

**ఆలేరు, జూలై 1 :**

జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ఆలేరు పట్టణంలోని మురళీ క్లినిక వైద్యుడు డా సీహెచ్. మురహారిని ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కేక్ కట్ చేసి డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. అనంతరం డా. మురహారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి రోగులకు ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. రోగుల పట్ల ఆప్యాయతతో, అంకిత భావంతో వైద్య సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని సిబ్బంది ప్రశంసించారు. డా. మురహారి మాట్లాడుతూ, వైద్య వృత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. రోగుల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ముంజ ఉమారాణి, గంధమల్ల భార్గవి, గంధమల్ల కళ్యాణి, ఈదునూరి అనూష, గ్యార సాగర్, వడ్ల శ్రీశాంత్ కుమార్ తదితరులు పాల్గొని డా మురహారికి శుభాకాంక్షలు తెలిపారు.

# అన్న - అక్క మెంటార్ షిప్ కార్యక్రమాన్ని ప్రారంభం

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి,కొడంగల్ ఎంఈఓ కె. రాంరెడ్డి

**కొడంగల్ మున్సిపల్, జులై,01**

కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అన్న – అక్క మెంటార్ షిప్ కార్యక్రమాన్ని బుధవారం కొడంగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మరియు మండల విద్యాధికారి కె. రాంరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం 4 నుండి 10వ తరగతుల విద్యార్థులకు కృత్రిమ మేధ మరియు డిజిటల్ లెర్నింగ్ కై ఉద్దేశింప బడిన ఇంటర్న్ షిప్ కార్యక్రమమన్నారు. ఎం. ఇ. ఓ కె. రాంరెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించడానికి విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమన్నారు. అదేవిధంగా కొడంగల్ మరియు సమీప గ్రామాల్లోని ఇతర ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల్లో కూడా ఈ కార్యక్రమాన్ని కళాశాల నోడల్ అధ్యాపకులు మరియు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని వారానికి 3 గంటల చొప్పున 30 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనికి గాను విద్యార్థులకు ఒక అకాడమిక్ క్రెడిట్ ను కూడా కేటాయిస్తారు. శిక్షణలో భాగంగా పాఠశాల విద్యార్థుల కు కృత్రిమ మేధ, కోడింగ్, ప్రోగ్రామింగ్, గేమ్ డిజైనింగ్, యానిమేషన్ వంటి అంశాలను భోదిస్తారు. ఈ కార్యక్రమంలో కళాశాల నోడల్ అధ్యాపకులు మరియు కళాశాల 5వ సెమిస్టర్ కు చెందిన 103 మంది విద్యార్థులు పాల్గొన్నారు.





# నాటక రంగానికి పోణంగి అప్పారావు ఎనలేని సేవలు

## నేడు పోణంగి శ్రీరామ అప్పారావు వర్ధంతి

తెలుగు నాటక రంగానికి పోణంగి శ్రీరామ అప్పారావు చేసిన సేవలు సాటి రానివి. అంతేకాదు ఉపాధ్యాయునిగా, ఉపన్యాసకునిగా, పరిపాలనా దక్షునిగా, రచయితగా, పరిశోధకునిగా ఆచార్య పోణంగి శ్రీ రామ అప్పారావు చేసిన కృషి అనన్య సామాన్యం. తెలుగు జాతికి, కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మహా మనీషి పోణంగి. పోణంగి శ్రీరామ అప్పారావు (జూలై 21, 1923 – జూలై 2, 2005) నాటకకర్త, అధ్యాపకులు, నాట్యశాస్త్రం అనువాదకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. అప్పారావు 1923, జూలై 21 వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు తాలూకా, బందపురంలో జన్మించారు. కొవ్వూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో, విజయవాడ శ్రీరాజా రంగయ్యప్పారావు కళాశాలలో, ఆంధ్ర విశ్వ విద్యాలయంలోను విద్యాభ్యాసం చేశారు.

తెలుగు నాటక వికాసం' అనే అంశంపై పరిశోధన చేసి 1961 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా స్వీకరించారు. తెలుగు నాటక రంగాన్ని గురించిన సర్వ సమగ్రమైన గ్రంథమిది. 1967లో ఈ గ్రంథం వెలువడిన నాటినుంచి నాటక రంగానికి ప్రామాణిక గ్రంథంగా విరాజిల్లుతుంది. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. భీమవరం, రాజమండ్రి, కడప, శ్రీకాకుళం, మద్రాసు కళాశాలలో, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఉపన్యాసకులుగా, హైదరాబాద్ న్యూ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా, పాఠ్య పుస్తకాల ప్రత్యేకాధికారిగా, సాంస్కృతిక శాఖ ప్రత్యేకాధికారిగా, తెలుగు అకాడమీ – అంతర్జాతీయ తెలుగు సంస్థల స్థాపక డైరెక్టర్ గా, ప్రథమ ప్రపంచ తెలుగు మహా సభల ప్రధాన కార్యదర్శిగా, సాంస్కృతిక వ్యవహారాల శాఖ డైరెక్టర్ గా, ఆయా పదవులకే వన్నె తెచ్చారు.

రాష్ట్ర సంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకునిగా, తెలుగు అకాడమీ, అంతర్జాతీయ తెలుగు సంస్థ (అదే శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంగా మారింది) వ్యవస్థాపక సంచాలకునిగా అప్పారావు ఎనలేని సేవలందించారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన ప్రప్రథమ అంతర్జాతీయ తెలుగు మహా సభలకు ప్రధాన కార్యదర్శి హోదాలో నిర్విరామంగా శ్రమించి, "నభూతో నభవిష్యతి" గా విజయ వంతం చేశారు. ఆనాటి ముఖ్య మంత్రి జలగం వెంగళరావు, విద్యా మంత్రి మండలి వెంకట కృష్ణారావు నేతృత్వంలో తెలుగుజాతి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే విధంగా అంతర్జాతీయ తెలుగు మహా సభలకు రూపకల్పన చేసి, తర్వాతి మహా సభలకు మార్గ నిర్దేశనం చేశారనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. అప్పారావు 1987 లో కలకత్తాలో జరిగిన విశ్వ ఉన్నయన్ సంసద్లో రాష్ట్ర నాట్య సామ్రాట్ బిరుదును, 1990లో హైదరాబాదు యువ కళావాహిని వారిచే నాటక రత్న బిరుదాన్ని, 1992 లో శ్రీకాళహస్తి భరతముని ఆర్ట్స్ అకాడెమీ వారిచే కళారత్న బిరుదాన్ని అందుకున్నారు.

భరతముని సంస్కృతంలో వ్రాసిన నాట్య శాస్త్రాన్ని డాక్టర్ పి.ఎస్.ఆర్. అప్పారావు తెలుగు లోకి అనువదించారు. నాట్యంలోని వివిధ అభినయాలపై సవివరంగా ఎన్నో పుస్తకాలు రచించారు. నాట్యంలో శిక్షణ ఇచ్చే గురువులకు, నృత్యం నేర్చుకునే కళాకారులకు అవి ప్రామాణిక పాఠ్య గ్రంధాలుగా గుర్తింపు పొందాయి. అలనాటి నాటక రంగ ప్రముఖుల జీవిత విశేషాలను సేకరించి, గ్రంధస్తం చేశారు. ఎన్నో ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థలు ఆయనను గౌరవించి సత్కరించాయి. దేశ, విదేశాలలో నాట్య శాస్త్రం.పైన, రంగస్థల విషయాలపైన పరిశోధనలు చేసి, అనేక ప్రసంగాలు చేశారు.తాజ్ మహల్ (నాటిక), విశ్వభారతి (నవల), వేణువు (పద్యాత్మక గద్యము), నాట్యశాస్త్రము (గుప్తభావ ప్రకాశికా సహితము – జాతీయ బహుమతి పొందిన గ్రంథం), నాటక రచనా ప్రయోగములు (సిద్ధాంత గ్రంథము), తెలుగు నాటక వికాసము (డాక్టరేట్ పట్ట పరిశోధన వ్యాసము) తదితరాలు ఆయన ఇతర రచనలు.

'నాట్యశాస్త్ర 'గ్రంథానికి దివంగత ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేతుల మీదుగా కేంద్ర సాహిత్య అకాడమీ జాతీయ అవార్డును అందుకొన్నారు. నాటకరంగ పరిశోధనలో విశేషంగా కృషి చేసిన అప్పారావు 2005, జూలై 2 న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

### బహుముఖ ప్రజ్ఞాశాలి, వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శి

# పట్టాభిరామ్

## వ్యక్తిత్వ వికాసానికి వెలుగునిచ్చిన బి.వి. పట్టాభిరామ్



ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బి.వి. పట్టాభిరామ్ (భావరాజు వేంకట పట్టాభిరామ్) తెలుగు ప్రజలకు సుపరిచితమైన మానసిక విజ్ఞాన ప్రసారకుడు. వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా, హిప్నాటిస్టుగా, రచయితగా, ఇంద్రజాలికుడిగా, ప్రసంగకర్తగా, సమకాలీన మానవ మనస్సు రహస్యాలను అన్వేషించిన అభ్యుదయ–వేత్తగా భారతదేశం మొత్తంలో పేరుగాంచారు. ఆయన అంతఃప్రయాణం వేలాది మందికి వెలుగునివ్వగా, బాహ్య ప్రపంచంలో అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రావ్ సాహెబ్ భావరాజు సత్యనారాయణ, లక్ష్మీకాంతమ్మ దంపతులకు పుట్టిన పట్టాభిరామ్ 15 మంది సంతానంలో ఒకరు. బాల్యంలోనే జ్ఞాపకశక్తి, విశ్లేషణా బలంతో గరిష్ట స్థాయికి ఎదిగే వాడని గురువులు గుర్తించారు. కాకినాడలో ఉన్నత విద్య చదువుతూ, ఇంద్రజాల కళపై ఆకర్షితుడయ్యారు. అప్పుడు ప్రముఖ మాంత్రికుడు ఎంబేర్ రావు వద్ద శిక్షణ తీసుకుని మాయాజాలం నేర్చుకున్నారు.

విద్యాభ్యాసంలో ఆయన బహుశాఖా ప్రతిభ స్పష్టంగా కనిపించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సైకాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీహెచ్‌డీ, ఇతర పలు రంగాల్లో కూడా స్నాతకోత్తర విద్యను అభ్యసించారు. హిప్నోథెరపీ, యోగా, కౌన్సిలింగ్, జర్నలిజం వంటి విభిన్న రంగాల్లో పీహెచ్‌డీలు, డిప్లొమాలను పూర్తి చేసి, అవి అన్ని సమాజ సేవకు వినియోగించారు. పట్టాభిరామ్ తన జీవితం మొత్తాన్ని వ్యక్తిత్వ వికాసానికి అంకితం చేశారు. విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వంటి అనేక వర్గాలకు ప్రత్యేక శిక్షణా తరగతులు, అవగాహనా సదస్సులను నిర్వహించారు. ఆయన మాటల్లో మంత్రసక్తి ఉంది. "మనస్సుని గెలిచేవాడే జీవితాన్ని గెలవగలడు" అన్న ఆయన సందేశం జనసామాన్యంలో విస్తరించింది. ఆకాశవాణి, దూరదర్శన్, వివిధ టీవీ చానెల్లు, వర్క్‌షాపులు, శిక్షణా శిబిరాల ద్వారా ఆయన సందేశం లక్షల మందికి చేరింది. హిప్నాటిజం పట్ల ఉన్న అపోహలను తొలగించి, దీనిని ఒక మానసిక చికిత్సా పద్ధతిగా ప్రజలకు అందించారు. "సంస్కార హిప్నోథెరపీ" అనే రూపంలో భావోద్వేగ శుద్ధిని సాధించే మార్గాలను పరిచయం చేశారు. ఆయన హిప్నోథెరపీ ప్రదర్శనలను చూసినవారికి అది మంత్రిక విద్య కాదు, మనోవైద్య విధానమని స్పష్టమైంది.

వైద్య రంగంలో కూడా ఆయన సేవలు విశేషం. క్యాన్సర్, ఫోబియా, డిప్రెషన్, నిద్రలేమి వంటి అనేక సమస్యలకు హిప్నోథెరపీ ద్వారా పరిష్కారాలు సూచిస్తూ డాక్టర్లతో కలిసి పనిచేశారు. ఆయుర్వేద, యోగా, మానసిక చికిత్సల సమన్వయంతో ప్రత్యేక మోడల్‌ను అభివృద్ధి చేశారు. రచయితగా ఆయన రచనలు లక్షలాది పాఠకుల జీవితాల్లో మార్పు తీసుకు వచ్చాయి. "విజయం నీ చేతుల్లోనే", "ఆత్మ విశ్వాసమే ఆయుధం", "ఆలోచనలే ఆయుధాలు", "జీవిత వికాస మార్గం", "మీరు విజేతలు కావచ్చు", "సమర్థమైన చదువు ఎలా చదవాలి?", Exam fear ని ఎలా జయించాలి?" వంటి పుస్తకాలు ప్రత్యేకంగా గుర్తించ దగినవి. ఈ రచనలు తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, కన్నడ భాషల్లోనూ వెలువడ్డాయి. 1990లలో ఆంధ్రప్రభ సచిత్రవార పత్రికలో "బాలలకు బంగారుబాట" శీర్షికతో బాలల అభ్యుదయానికి రచనలు చేశారు. "బాలజ్యోతి" పత్రికలో "మాయావిజ్ఞానం" పేరిట ఇంద్రజాలంలోని శాస్త్రీయ కోణాన్ని తెలియజేశారు. పట్టాభిరామ్ అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందారు. అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా, సింగపూర్, అరబ్ దేశాల్లో వర్క్‌షాపులు నిర్వహించి భారతీయ సైకాలజీ విజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. విద్యార్థులకు, టీచర్లకు, మేనేజర్లకు, వైద్యులకు -- వర్గం లేకుండా ప్రతి ఒక్కరికి జీవితానుభవాలతో మేళవించిన ఆత్మవిశ్వాసాన్ని అందించారు.

సినిమా రంగంలో కూడా ఆయన ఆకస్మికంగా కనిపించినా, నటుడిగా తక్కువ సన్నివేశాల్లో తన అభినయ ప్రతిభను చూపించారు. ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, రచయితగా, ప్రసంగకర్తగా, పత్రికా వ్యాసకర్తగా, ఆయన విస్తరణ అర్థం చేసుకోవడానికే సమయం కావాలి. పట్టాభిరామ్ జీవిత భాగస్వామి జయ, తన భర్తతో కలిసి వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కుమారుడు ప్రశాంత్ తన తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో ఉన్నాడు. హైదరాబాద్‌లో గుండెపోటుతో బి.వి. పట్టాభిరామ్ జూన్ 30, 2025న మృతి చెందారు. ఆయన మరణం సైకాలజీ, వ్యక్తిత్వ వికాస రంగాలకు తీరని లోటుగా నిలిచింది. అయినా ఆయన ప్రవేశపెట్టిన భావాల విత్తనాలు మనసుల్లో మొలకెత్తుతూనే ఉన్నాయి.బి.వి. పట్టాభిరామ్ పేరు మానవ మానసిక వికాస చరిత్రలో చిరస్థాయిగా నిలవనిది. మన జీవితాల్లో ఒత్తిడి, అనిశ్చితి, గందరగోళం మధ్య ఆలోచనలే ఆయుధాలు అన్న ఆయన పాఠం జీవన మార్గదర్శకంగా నిలుస్తుంది. తన వ్యక్తిత్వంలో జ్ఞానాన్ని, హాస్యాన్ని, శాంతాన్ని మేళవించిన ఈ మేధావి పేరు, పుస్తకాలు, ప్రసంగాలు – తరతరాల పాఠశాలలపై తన ప్రభావాన్ని కొనసాగిస్తూనే ఉంటాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

### పేటెంట్ నుంచి ప్రపంచ ప్రసారం వరకూ

# మార్కోని వైజ్ఞానిక యాత్ర

## నేడు రేడియో కోసం పేటెంట్ పొందిన దినం



1897లో ఇటలీకి చెందిన యువ శాస్త్రవేత్త గూగ్లీమొ మార్కొని లండన్‌లో రేడియో కోసం పేటెంట్ పొందిన ఘట్టం ప్రపంచ సమాచార చరిత్రలో విప్లవాత్మక మలుపు తీసుకు వచ్చింది. వైర్లు లేకుండా దూర ప్రాంతాలకు సంకేతాలను పంప గల సాంకేతికతను విజయ వంతంగా అభివృద్ధి చేయడంలో మార్కొని సుస్పష్టమైన ముందడుగు వేసాడు. అతని ఆవిష్కరణ ఆధునిక టెలికమ్యూనికేషన్‌కు పునాది వేసింది.

మార్కొని 1874లో ఇటలీలో జన్మించి, బాల్యం నుంచే విద్యుత్, మాగ్నెటిజం, తరంగాలపై ఆసక్తి పెంచుకున్నాడు. జర్మన్ శాస్త్రవేత్త హెయిన్‌రిచ్ హెర్ట్జ్ నిర్వహించిన ఎలక్ట్రో మాగ్నెటిక్ తరంగాల ప్రయోగాలపై లోతుగా అధ్యయనం చేసి, 1895లో తన స్వగృహంలో వైర్లను ఉపయోగించకుండా సంకేతాలను ప్రసారం చేసే ప్రయోగాలను ప్రారంభించాడు. ప్రారంభంగా కొన్ని మీటర్ల దూరానికే సంకేతాలను పంపగలిగిన ఈ పరికరాలను మరింత మెరుగుపరిచి, కిలోమీటర్ల దూరాన్ని అధిగమించే స్థాయికి చేర్చాడు.

1897 జూలై 2న బ్రిటిష్ పేటెంట్ కార్యాలయం నుండి అతనికి "వైరులేని టెలిగ్రఫీ వ్యవస్థ"కు పేటెంట్ నంబర్ +దీ189612039గా, మంజూరు చేసింది. అదే ఏడాది బ్రిటన్‌లో 'ది వైర్‌లెస్ టెలిగ్రాఫ్ అండ్ సిగ్నల్ కంపెనీ'ను స్థాపించాడు. ఇది తరువాత "మార్కొనీస్ వైర్‌లెస్ టెలిగ్రాఫ్ కంపెనీ"గా మారింది. ఇదే సంస్థ ద్వారా మార్కొని తన పరిశోధనలకు మరింత గతి కల్పించాడు.

1901లో మార్కొని అట్లాంటిక్ మహా సాగరాన్ని దాటి తొలిసారిగా ఇంగ్లండ్ నుంచి కెనడా న్యూఫౌండ్లాండ్ వరకు తారంగిక సంకేతాన్ని విజయవంతంగా పంప గలిగాడు. ఈ ఘనత ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 1909లో రేడియో కమ్యూనికేషన్ రంగంలో చేసిన విశేష కృషికి గాను ఆయనకు నోబెల్ ఫిజిక్స్ బహుమతి లభించింది. ఈ పురస్కారాన్ని కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్‌తో కలసి పంచుకున్నాడు.

1912లో టైటానిక్ నౌకా ప్రమాద సమయంలో మార్కొని అభివృద్ధి చేసిన తారంగిక పరికరాల ద్వారానే అత్యవసర సమాచారాన్ని ఇతర నౌకలకు, తీర ప్రాంతాలకు పంప గలిగారు. వందలాది ప్రాణాలను రక్షించడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించింది. ఈ సంఘటన రేడియో ప్రయోజనాలను ప్రపంచానికి పరిచయం చేసింది.

రేడియో అభివృద్ధి తరువాతి దశల్లో మరింత వేగంగా జరిగింది. 1920లో అమెరికాలో మొట్టమొదటి వాణిజ్య రేడియో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. 1923లో బ్రిటన్‌లో బీబీసీ (దీదీజ) ఏర్పాటు అయ్యింది. 1936 నాటికి నాటకాలు, సంగీత ప్రదర్శనలతో రేడియో వినోద వేదికగా మారింది. ప్రపంచ యుద్ధాల సమయంలో రేడియోను రాజకీయ ప్రచారాలకు, మానవ హక్కుల ప్రచారానికి వేదికగా వినియోగించారు.

భారతదేశంలో 1927లో మొదటి రేడియో ప్రసార కేంద్రం ముంబయిలో స్థాపించ బడింది. 1936లో ఆకాశవాణి ఏర్పడి, దేశవ్యాప్తంగా సమాచారాన్ని విస్తరించేందుకు పాలు పంచుకుంది. 1957లో ప్రారంభమైన 'వివిధ భారతి'తో పాటలు, వినోద కార్యక్రమాలు ప్రజల మనసులు గెలుచుకున్నాయి. 2001 తర్వాత ప్రైవేట్ ఎఫ్.ఎం. స్టేషన్లు రంగంలోకి ప్రవేశించి, రేడియో వినికిడి అనుభవాన్ని ఆధునికీకరించాయి.

నేటి డిజిటల్ యుగంలోనూ రేడియో తన ప్రాధాన్యతను కోల్పోలేదు. మొబైల్ ఫోన్లు, కారు స్టీరియోలు, ఆన్‌లైన్ రేడియో యాప్‌లు రేడియో వినికిడికి సులభతరం చేశాయి. నగరాల నుంచే కాదు, గ్రామీణ ప్రాంతాల వరకు కూడా ఇది సముచిత సమాచారం, వినోదం, మరియు సామాజిక అవగాహన కార్యక్రమాల వేదికగా కొనసాగుతోంది.

గూగ్లీమొ మార్కొని 1897లో సాధించిన విజయం కేవలం ఒక శాస్త్రీయ ఘట్టంగా కాక, మానవ సంబంధాల వికాసానికి, ప్రపంచీకరణకు, సమాచార విప్లవానికి పునాది వేసింది. రేడియో రూపంలో ప్రపంచానికి అందించిన సేవ ఆయనను శాశ్వతంగా శాస్త్ర చరిత్రలో నిలిపింది. అతని ఆవిష్కరణలతో ప్రారంభమైన ప్రయాణం ఈ రోజు డిజిటల్ కమ్యూనికేషన్ వరకూ విస్తరించి, సాంకేతిక విజ్ఞాన పరిణామంలో ఒక గాఢమైన అధ్యాయంగా నిలిచి పోయింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



## పసిడి ధరలు తగ్గుముఖం

**హైదరాబాద్, జూలై 1:** పసిడి డిమాండ్ దాదాపు 70 శాతం తగ్గినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్న నేపథ్యంలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. పాత బంగారు నగలను విక్రయించేందుకు వినియోగదారులు ఎక్కువగా ముందుకు వస్తుండటంతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం 11 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,780గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,29,050గా ఉంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,05,590గా కొనసాగుతోంది. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో ఒకే ధరలు నమోదయ్యాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో బంగారం ధర అత్యధికంగా నమోదైంది. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,910గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,40,930, అహ్మదాబాద్‌లో రూ.1,40,830, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో రూ.1,40,780గా నమోదైంది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ ధరల మార్పులు, వినియోగదారుల కొనుగోలు ధోరణులను బట్టి రానున్న రోజుల్లో బంగారం ధరల్లో మరింత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర



**ఢిల్లీ, జూలై 1:** హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ. 183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తగ్గిన ఈ ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర రూ. 2,930 కి చేరింది. ఈ ధర నిన్నటి వరకూ రూ.3,113 గా ఉంది. ఇక, దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఈ తగ్గింపునకు అనుగుణంగానే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు మారనున్నాయి. అయితే స్థానిక పన్నులకు (వాటు) అనుగుణంగా ఆయా నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరల్లో స్వల్ప తేడాలు ఉంటాయి.

## వివో ఫోన్ల ధరలు పెంపు

### రూ.7 వేల వరకు భారమైన కొత్త రేట్లు



**న్యూఢిల్లీ, జూలై 1:** భారత్‌లో ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివో తన పలు స్మార్ట్‌ఫోన్ మోడళ్ల ధరలను పెంచింది. ఎక్స్, వీ, టీ, వై సిరీస్‌లకు చెందిన మొత్తం తొమ్మిది మోడళ్లపై రూ.2,000 నుంచి రూ.7,000 వరకు ధరలు పెంచినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఇందులో వివో ఎక్స్300 ఎఫ్ఈ మోడల్‌పై అత్యధికంగా రూ.7,000 పెంపు నమోదైంది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్‌లో మెమరీ చిప్‌ల ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థపై ఒత్తిడి, తయారీ వ్యయాలు అధికం కావడం వల్లే కంపెనీ ధరలను సవరించినట్లు తెలుస్తోంది. అయితే ధరల పెంపుపై వివో అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ధరలు పెరిగిన మోడళ్లలో వివో ఎక్స్300 ఎఫ్ఈ, వివో వీ70 ఎఫ్ఈ, టీ4 లైట్ 5జీ, వై51 ప్రో, వై31 5జీ, టీ5ఎక్స్, వై21, వై11, వై05 ఉన్నాయి. వీటిలో కొన్ని మోడళ్లకు గతంలో కూడా ధరలు పెరగగా, ఇప్పుడు మరోసారి సవరణ చేయడంతో ప్రారంభ ధరలతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల నమోదైంది. తాజా ధరల ప్రకారం, వివో ఎక్స్300 ఎఫ్ఈ 12 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.86,999కు చేరగా, 12 జీబీ ర్యామ్, 512 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.96,999గా నిర్ణయించారు. ధరల పెంపుతో ఈ మోడల్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో ఇతర ఫ్లాగ్‌షిప్ పరికరాలతో మరింత పోటీ ఎదుర్కోనుంది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్



**ముంబై, జూలై 1:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు నమోదవడంతో ప్రధాన సూచీలు పైకి ఎగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 140.10 పాయింట్లు లేదా 0.59 శాతం లాభపడి 24,005.85 వద్ద స్థిరపడగా, సెన్సెక్స్ 443.97 పాయింట్లు లేదా 0.58 శాతం పెరిగి 76,922.64 వద్ద ముగిసింది. మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, నిఫ్టీకి 24,100 నుంచి 24,200 స్థాయిలు కీలక నిరోధక ప్రాంతంగా ఉన్నాయి. ఈ స్థాయిని అధిగమిస్తే సూచీ 24,400 మార్కు దిశగా పయనించే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు 23,900 నుంచి 23,800 స్థాయిలు బలమైన మద్దతు ప్రాంతాలుగా ఉండనున్నాయని తెలిపారు. నిఫ్టీలో ఎటర్నల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, నెస్లే ఇండియా షేర్లు అత్యధిక లాభాలు నమోదు చేసి మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్ కూడా సానుకూలంగా ముగియగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.36 శాతం మేర పెరిగాయి. రంగాల వారీగా చూస్తే రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఆటో రంగాల షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి. అయితే ఐటీ, మెటల్, ఫార్మా రంగాల సూచీలు స్వల్ప ఒత్తిడిని ఎదుర్కొని బలహీనంగా ముగిశాయి. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై ఆశావహ అంచనాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు తగ్గడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు అదుపులో ఉండటం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్ని చేకూర్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. దీంతో 2026 రెండో అర్ధభాగంలోకి దేశీయ ఈక్విటీ మార్కెట్లు ఆశాజనక వాతావరణంలో అడుగుపెట్టినట్లు వారు పేర్కొన్నారు.

# లేఆఫ్ భయం కంటే అనిశ్చితే పెద్ద ఒత్తిడి




## వైరల్‌గా మారిన మైక్రోసాఫ్ట్ ఉద్యోగి పోస్టు

**సియాటిల్, జూలై 1:** మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ పోస్టు వైరల్‌గా మారింది. త్వరలో కంపెనీ చేపట్టనున్న ఉద్యోగుల కోతలో తన పేరు కూడా ఉండొచ్చని భావిస్తున్న ఆయన, ఉద్యోగం కోల్పోవడం కంటే ఆ అనిశ్చితి నుంచి బయటపడుతున్నాననే భావనే తనకు ఎక్కువ ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు. తన మేనేజర్‌కు లేఆఫ్ జాబితా అందబోతుందని, అందులో తన పేరు కూడా ఉండొచ్చని ముందే అర్థమైందని ఉద్యోగి వెల్లడించాడు. గత కొంతకాలంగా కీలక ప్రాజెక్టుల నుంచి తనను తప్పించడం, మేనేజర్ స్పందన తగ్గిపోవడం, కార్యాలయంలో చోటుచేసుకున్న మార్పులను గమనించి పరిస్థితిని ముందుగానే ఊహించానని తెలిపాడు. "ఉద్యోగం పోవడం సంతోషించాల్సిన విషయం కాదు. ప్రస్తుతం ఉద్యోగ మార్కెట్ కూడా అంత అనుకూలంగా లేదు. అయినప్పటికీ నెలల తరబడి వెంటాడుతున్న అనిశ్చితి ముగియబోతుందనే భావన నాకు ఉపశమనాన్ని ఇస్తోంది. ప్రతి త్రైమాసికం 'తర్వాతి వంతు నాదేనా' అనే భయంతో జీవించడం ఉద్యోగం కోల్పోవడం కంటే ఎక్కువ మానసిక ఒత్తిడికి గురిచేసింది" అని పోస్టులో పేర్కొన్నాడు. ఇంకా, ఒక దశ తర్వాత ఉద్యోగం పోతుందనే భయం తగ్గిపోతుందని, కానీ నిరంతర అనిశ్చితిలో పనిచేయడం వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తన అనుభవాన్ని పంచుకున్నాడు. ఈ పోస్టు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీసింది. పలువురు ఉద్యోగులు కూడా తమకు ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని, ఉద్యోగం కోల్పోయిన తర్వాతే మానసికంగా ప్రశాంతత లభించిందని వ్యాఖ్యానించారు. ఐటీ రంగంలో ఉద్యోగ భద్రత, కార్యాలయ ఒత్తిడిపై ఈ పోస్టు మరోసారి చర్చను తెరపైకి తీసుకొచ్చింది.

## జూన్‌లో జీఎస్టీ వసూళ్లు జోరు..

### రూ.1.94 లక్షల కోట్లకు చేరిన ఆదాయం

**న్యూఢిల్లీ, జూలై 1 :** వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి బలమైన వృద్ధిని నమోదు చేశాయి. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లకు చేరిందని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఇది 13.9 శాతం అధికం. ముఖ్యంగా దిగుమతులపై వసూలైన పన్ను భారీగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. వివరాల ప్రకారం.. గత ఏడాది జూన్‌లో రూ.1,71,105 కోట్లుగా ఉన్న స్థూల జీఎస్టీ వసూళ్లు ఈసారి రూ.1,94,812 కోట్లకు చేరాయి. దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లకు చేరుకుంది. రిఫండ్‌ల అనంతరం ప్రభుత్వానికి లభించిన నికర జీఎస్టీ ఆదాయం 11.2 శాతం పెరిగి రూ.1,62,377 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే నెలలో ఈ మొత్తం రూ.1,45,984 కోట్లుగా ఉంది. జూన్‌లో మొత్తం రిఫండ్‌లు దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లకు చేరాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లుగా నమోదవగా, ఎగుమతులకు సంబంధించిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లకు చేరుకున్నాయి. నికర ఆదాయాన్ని పరిశీలిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన జీఎస్టీ రాబడి 2.6 శాతం పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉండగా, దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం పెరిగి రూ.6,31,699 కోట్లకు చేరాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ ఆదాయం 7.1 శాతం వృద్ధితో రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. వరుసగా రెండో నెల కూడా రూ.1.94 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ వసూళ్లు నమోదవడం దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధికి సంకేతమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.






## అల్లం, ఉల్లి ధరల భారం

### వారంలోనే భారీ పెరుగుదల

**హైదరాబాద్, జూలై 1:** వంటింటి అవసరమైన అల్లం, ఉల్లిపాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం వారం రోజుల్లోనే అల్లం, ఉల్లి ధరలు గణనీయంగా పెరగడంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు పెరిగాయి. గత వారం కిలో అల్లం ధర రూ.150 ఉండగా ప్రస్తుతం రూ.220కు చేరుకుంది. ఉల్లిపాయల ధర కూడా కిలోకు రూ.25 నుంచి రూ.40 వరకు పెరిగింది. హోల్‌సేల్ మార్కెట్లలో టన్ను ఉల్లిపాయ ధర రూ.2,400 నుంచి రూ.3,400కు పెరగడం గమనార్హం. ధరల పెరుగుదలకు ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా తగ్గడమే ప్రధాన కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. హైదరాబాద్ మార్కెట్లకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి అధికంగా అల్లం, ఉల్లిపాయలు వస్తుంటాయి. సాధారణంగా రోజుకు 150 నుంచి 170 లారీల వరకు సరుకు చేరుతుండగా, ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు, రవాణా సమస్యల కారణంగా సరఫరా గణనీయంగా తగ్గింది. దీంతో మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా నిల్వలు లేక ధరలు పెరిగాయి. కొత్త పంట మార్కెట్‌లోకి వచ్చే వరకు ధరలు తగ్గే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. పంట పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాతే ధరలు సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అప్పటి వరకు వినియోగదారులు అధిక ధరల భారం భరించాల్సిన పరిస్థితి ఉంటుందని, ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఒక్కో పరుగుకు రూ.14 వేలు

- వైభవ్ బ్రాండ్ విలువకు రెక్కలు
- 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు.. ఆరెంజ్ క్యాప్‌తో సంచలనం
- ఎండార్స్‌మెంట్ ఫీజు రూ.2 కోట్ల వరకు పెరుగుదల
- మైనర్ కావడంతో భారీ బ్రాండ్లకు చట్టపరమైన అడ్డంకులు




**న్యూఢిల్లీ, జులై 1:** భారత క్రికెట్‌లో కొత్త సంచలనంగా మారిన 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో ఆటతో పాటు తన బ్రాండ్ విలువను కూడా అమాంతం పెంచుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్‌తో పాటు 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డును సొంతం చేసుకున్న వైభవ్, ప్రస్తుతం మార్కెట్లో అత్యంత డిమాండ్ ఉన్న యువ క్రీడాకారుడిగా నిలిచాడు. ఐపీఎల్ కాంట్రాక్ట్ ద్వారా ఏడాదికి రూ. 1.10 కోట్లు అందుకుంటున్న వైభవ్ చేసిన పరుగుల లెక్కన చూస్తే ఒక్కో పరుగుకు దాదాపు రూ. 14 వేల ఆదాయం లభిస్తున్నట్లు అంచనా. ఈ ప్రదర్శన తర్వాత అతని బ్రాండ్ విలువ కూడా భారీగా పెరిగింది. ప్రస్తుతం ఒక్కో ప్రకటన ఒప్పందానికి రూ. 50 లక్షల నుంచి రూ. 1.5--2 కోట్ల వరకు పారితోషికం అందుకుంటున్నట్లు సమాచారం. అయితే వైభవ్ వయసు కేవలం 15 సంవత్సరాలు కావడంతో పలు ప్రముఖ ఆటోమొబైల్, లైఫ్‌స్టైల్ బ్రాండ్లు అతనితో ఒప్పందాలు చేసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నాయి. భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లు నిండకపోతే డ్రైవింగ్ లైసెన్స్ పొందడం సాధ్యం కాదు. దీంతో వాహనాల ప్రకటనల్లో అతన్ని చూపించడం చట్టపరంగా ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉందని కంపెనీలు భావిస్తున్నాయి. అలాగే పెద్దల కోసం ఉద్దేశించిన గ్రూమింగ్ ఉత్పత్తులు, లగ్జరీ వస్తువులు, ఫాంటసీ గేమింగ్, ఆర్థిక సేవలకు సంబంధించిన ప్రకటనల్లో కూడా మైనర్లను ఉపయోగించడంపై పరిమితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బ్రాండ్లు కూడా తమ వ్యూహాన్ని మార్చుకున్నాయి. గతంలో మాదిరిగా దీర్ఘకాలిక ఒప్పందాల కంటే ప్రస్తుతం రెండేళ్ల నుంచి మూడేళ్ల స్వల్పకాలిక ఒప్పందాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే స్పోర్ట్స్ డ్రింక్స్, క్రికెట్ సామగ్రి, న్యూట్రిషన్ ఉత్పత్తులు, స్పోర్ట్స్ షూ బ్రాండ్లు మాత్రం వైభవ్‌తో ఒప్పందాలకు ఆసక్తి చూపుతున్నాయి. మరోవైపు అతని కుటుంబం, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం అతన్ని అధిక వాణిజ్య ప్రచారాలకు దూరంగా ఉంచుతూ, వయసుకు తగిన బ్రాండ్లను మాత్రమే ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ అంచనా ఆస్తి విలువ సుమారు రూ. 3 కోట్లుగా భావిస్తున్నారు. త్వరలో భారత జట్టులో స్థానం దక్కితే బీసీసీఐ వార్షిక ఒప్పందం ద్వారా అతని ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో రానున్న రోజుల్లో భారత క్రికెట్‌లోనే అత్యధిక బ్రాండ్ విలువ కలిగిన యువ ఆటగాళ్లలో వైభవ్ ఒకరిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# 40 ఏళ్ల తర్వాత మెక్సికో చరిత్ర

## రౌండ్ ఆఫ్ 16లోకి ఘనంగా అడుగు

**మెక్సికో సిటీ, జూలై 1:** ఫిఫా ప్రపంచకప్ 2026లో సహ ఆతిథ్య దేశమైన మెక్సికో రౌండ్ ఆఫ్ 16లోకి ఘనంగా ప్రవేశించింది. రౌండ్ ఆఫ్ 32లో ఈక్వెడార్‌పై 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించి నాకౌట్ దశలో నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించింది. మ్యాచ్ తొలి అర్ధభాగంలోనే మెక్సికో రెండు గోల్స్ నమోదు చేసి ఆధిపత్యం చాటింది. 22వ నిమిషంలో జులియన్ క్వినోనిస్ తొలి గోల్ చేయగా, 31వ నిమిషంలో రౌల్ జిమెనెజ్ మరో గోల్ సాధించి జట్టుకు 2–0 ఆధిక్యం అందించాడు. అనంతరం ఈ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకున్న మెక్సికో సునాయాస విజయాన్ని నమోదు చేసింది. 1986 ప్రపంచకప్‌లో బల్గేరియాపై నాకౌట్ దశలో గెలిచిన తర్వాత తొలిసారి మెక్సికో ఈ దశలో విజయం సాధించింది. గత ఏడు ప్రపంచకప్‌లలో వరుసగా నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓడిన మెక్సికోకు ఈ విజయం చారిత్రకంగా నిలిచింది. ఈ టోర్నీలో జులియన్ క్వినోనిస్‌కు ఇది మూడో గోల్ కావడం విశేషం. స్వదేశీ అభిమానుల మద్దతుతో జోరుమీదున్న మెక్సికో ఇప్పుడు క్వార్టర్ ఫైనల్ బెర్త్ కోసం రౌండ్ ఆఫ్ 16లో మరో కీలక పోరుకు సిద్ధమవుతోంది.

# వింబుల్డన్ సింగిల్స్‌లో ఓడిన సెరీనా విలియమ్స్



**లండన్:** 44 ఏళ్ల వయసులో సెరీనా విలియమ్స్.. వింబుల్డన్‌లో రీ-ఎంట్రీ ఇచ్చింది. వైల్డ్‌కార్డు ఎంట్రీతో టోర్నీలో ఆడిన మాజీ చాంపియన్.. మంగళవారం తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూసింది. 23 గ్రాండ్ స్లామ్ టోర్నీలు గెలిచిన సెరీనా.. తొలి రౌండ్‌లో 20 ఏళ్ల ఆస్ట్రేలియా ప్లేయర్ మాయా జాయింట్ చేతిలో 6–3, 6–7 (6), 6–3 స్కోరు తేడాతో పరాజయాన్ని చవిచూసింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత మళ్లీ వింబుల్డన్‌లో సెరీనా అడుగుపెట్టింది. ఏదైనా అద్భుతం చేస్తుందో ఏమో అని ఆమె అభిమానాలు ఎదురుచూశారు. భర్త , ఇద్దరు పిల్లలు కూడా ఆ మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చారు. కానీ అనూహ్య రీతిలో సింగిల్స్ మ్యాచ్‌లో సెరీనా విలియమ్స్ ఇంటి దారి పట్టాల్సి వచ్చింది. తన కన్నా సగం వయసున్న ఆస్ట్రేలియా ప్లేయర్ మాయాతో కొంత వరకు ధీటుగానే పోరాడింది. సర్వీసును దాదాపు 129 మీటర్ల వేగంతో కొట్టింది. గ్రౌండ్ స్ట్రోక్స్ కూడా సెరీనా బాగానే ఆడింది. కానీ ప్రత్యర్థి మాయా.. సెరీనాను పరుగెత్తించింది. వింబుల్డన్‌లో మళ్లీ ఆడడం ఆనందంగా ఉందని, మళ్లీ వస్తానా రానో అనుకున్నట్లు చెప్పింది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియాతో సెరీనా మీటింగ్ కాలేదని వింబుల్డన్ నిర్వాహకులు తెలిపారు.

# హార్దిక్ కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీల పోటీ

## ట్రేడ్ రేసులో సీఎస్‌కే, కేకేఆర్ ముందంజ

**ముంబై, జూలై 1:** ఐపీఎల్ 2026 సీజన్‌లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత ముంబై ఇండియన్స్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీని వీడేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అతడిని దక్కించుకునేందుకు పలు ఐపీఎల్ ఫ్రాంచైజీల మధ్య ట్రేడ్ పోటీ నెలకొంది. సమాచారం ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగిలిన పలు ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ ట్రేడ్ రేసులో ముందున్నట్లు తెలుస్తోంది. ఎంఎస్ ధోనీ తర్వాత జట్టుకు అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ అవసరమని భావిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ హార్దిక్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్ హార్దిక్‌కు నేరుగా కెప్టెన్సీ బాధ్యతలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రాజస్థాన్ రాయల్స్ కూడా దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా అతడిని తమ జట్టులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే ఈ ట్రేడ్‌పై ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా అధికారిక ప్రకటన చేయలేదు. ట్రేడ్ పూర్తిగా నగదు రూపంలో జరుగుతుందా లేదా ఆటగాళ్ల మార్పిడి రూపంలో ఉంటుందా అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఆటగాడి అంగీకారంతో పాటు ఫ్రాంచైజీల మధ్య ఒప్పందం కుదిరిన తర్వాతే ట్రేడ్ అధికారికంగా ఖరారుకానుంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై క్రికెట్ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.




# నేటి నుంచే ఇంగ్లండ్‌తో పోరు

- పుంజుకోవాలని భారత్
- చెస్టర్-లీ-స్ట్రీట్‌లో రాత్రి 10 గంటలకు తొలి టీ20
- ఐదు టీ20లు, మూడు వన్డేల్లో భారత్--ఇంగ్లండ్ పోటీ
- వైభవ్ అరంగేట్రంపై అభిమానుల్లో ఆసక్తి
- సోనీ స్పోర్ట్స్, సోనీ లివ్‌లో ప్రత్యక్ష ప్రసారం

**న్యూఢిల్లీ, జులై 1:** ఐర్లాండ్ చేతిలో టీ20 సిరీస్‌ను 0–2తో కోల్పోయిన భారత జట్టు.. ఇప్పుడు ఇంగ్లండ్ పర్యటనలో విజయాలతో పుంజుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇరు జట్ల మధ్య నేటి నుంచి ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. తొలి టీ20 మ్యాచ్ చెస్టర్–లీ–స్ట్రీట్‌లోని రివర్‌సైడ్ గ్రౌండ్‌లో భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు ప్రారంభమవుతుంది. టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అరంగేట్రం దక్కుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మరోవైపు బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ అనంతరం హ్యారీ బ్రూక్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న ఇంగ్లండ్ జట్టు స్వదేశంలో సిరీస్‌ను సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది.



### ఇంగ్లండ్ జట్టు

హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, టామ్ బాంటన్, జోర్డాన్ కాక్స్, జాకబ్ బెతెల్, జేమ్స్ కోల్స్, సామ్ కరన్, లియామ్ డాసన్, విల్ జాక్స్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, సోనీ బేకర్, సాకిబ్ మహమ్మద్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్.

### ప్రత్యక్ష ప్రసారం ఎక్కడ?

భారత్–ఇంగ్లండ్ టీ20, వన్డే సిరీస్‌ల ప్రత్యక్ష ప్రసార హక్కులు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ కు ఉన్నాయి. టెలివిజన్‌లో సోనీ స్పోర్ట్స్ ఛానళ్లలో మ్యాచ్‌లను వీక్షించవచ్చు. అలాగే సోనీ లివ్ యాప్‌లో అన్ని మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.

## భారత్-ఇంగ్లండ్ 2026 పూర్తి షెడ్యూల్

### టీ20 సిరీస్

**జూలై 1:** తొలి టీ20 – రివర్‌సైడ్ గ్రౌండ్, చెస్టర్–లీ–స్ట్రీట్ (రాత్రి 10:00IST)

**జూలై 4:** రెండో టీ20 – ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్ (సాయంత్రం 7:00 IST)

**జూలై 7:** మూడో టీ20 – ట్రెంట్ బ్రిడ్జ్, నాటింగ్‌హామ్ (రాత్రి 10:00 IST)

**జూలై 9:** నాలుగో టీ20 – సీట్ యూనిక్ స్టేడియం, బ్రిస్టల్ (రాత్రి 10:00 IST)

**జూలై 11:** ఐదో టీ20 – యుటిలిటా బౌల్, సౌతాంప్టన్ (సాయంత్రం 7:00 IST)

### వన్డే సిరీస్:

**జూలై 14:** తొలి వన్డే – ఎడ్జ్‌బాస్టన్, బర్మింగ్‌హామ్ (సాయంత్రం 5:30 IST)

**జూలై 16:** జూలై 16: రెండో వన్డే – సోఫియా గార్డెన్స్, కార్డిఫ్ (సాయంత్రం 5:30 IST)

**జూలై 19:** మూడో వన్డే – లార్డ్స్, లండన్ (మధ్యాహ్నం 3:30 IST)

### భారత్ జట్లు

**టీ20 జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ.

**వన్డే జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్.

చురకలు





# కాగితం పడవలు బృందానికి చిరు అభినందనలు



కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ, కాలక్రమేణా ఒక చిత్ర నిర్మాతగా మారిన మెగా అభిమాని అంజనప్ప , 45 మంది తన స్నేహితులు, 'కాగితం పడవలు' చిత్రబృందంతో కలిసి చిరంజీవి పై ఉన్న అభిమానంతో, వందల కిలోమీటర్లు ప్రయాణించి మరీ హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు. 'రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి' అని మెగాస్టార్ చిరంజీవి ఇచ్చిన పిలుపును గుండెల్లో నింపుకుని, లక్షలాది మంది ప్రాణాలను కాపాడటంలో మెగాభిమానులు ఎప్పుడూ ముందుంటారని మరోసారి వారంతా నిరూపించారు. ఈ విషయం చిరంజీవి వరకు చేరడంతో ఆయన చాలా హ్యాపీగా ఫీలయ్యారు. విశేషం ఏంటంటే.. అంజనప్ప ఇంతవరకు చిరంజీవిని నేరుగా కలవలేదు. కేవలం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి తన బాధ్యతగా తన చిత్ర బృందంతో కలిసి రక్తదానం చేసి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి.. సినిమా షూటింగ్, ఇతర సామాజిక కార్యక్రమాలతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ.. అంజనప్ప అండ్ టీమ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ స్వయంగా ఒక లెటర్ పంపించారు. ప్రియమైన అంజనప్ప, గాయత్రమ్మ.. ఇంకా 'కాగితం పడవలు' చిత్రయూనిట్ సభ్యులకు.. మానవత్వాన్ని పరిమళింపజేస్తూ, సమాజం పట్ల మీ బాధ్యతను చాటుతూ మీరు చేపట్టిన రక్తదాన సేవా కార్యక్రమానికి నా హృదయపూర్వక అభినందనలు. ఈరోజు చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో 'కాగితం పడవలు' చిత్రయూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మొత్తం 23 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. వైద్య కారణాల వల్ల రక్తదానం చేయలేకపోయిన వారు, ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో రావడం కూడా ప్రశంసనీయం.

# కత్రినా కైఫ్ ప్రస్థానం

బాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందిన కత్రినా కైఫ్ తన ప్రతిభతో సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. చదువు కంటే నటనపై ఆసక్తి పెంచుకున్న ఆమె, కష్టపడి స్టార్ హీరోయిన్‌గా ఎదిగి కోట్లాది మంది అభిమానులను సంపాదించారు. ప్రస్తుతం అత్యధిక పారితోషికం అందుకునే నటీమణుల్లో ఆమె ఒకరిగా నిలిచారు. తెలుగు ప్రేక్షకులకు కూడా కత్రినా కైఫ్ సుపరిచితమే. వెంకటేష్ కథానాయకుడిగా నటించిన 'మల్లీశ్వరి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. అనంతరం బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రంలో నటించారు. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో తిరిగి బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగిన కత్రినా, ప్రముఖ హీరో విక్కీ కౌశల్‌ను వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. వివాహం అనంతరం కూడా ఎంపిక చేసిన చిత్రాల్లో నటిస్తూ సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను పదో తరగతి పూర్తి చేయలేదని కత్రినా వెల్లడించారు. అయినప్పటికీ తన ప్రతిభతో ఒక్కో చిత్రానికి సుమారు రూ.25 కోట్ల వరకు పారితోషికం అందుకునే స్థాయికి చేరుకున్నారు. ఆమె ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగానే ఉంటుందని సినీ వర్గాల అంచనా. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.



# ఆల్ఫా సెన్సార్ పూర్తి.. 3న విడుదల

శివ్ రావైల్ దర్శకత్వంలో, అలియా భట్, శర్వరి ప్రధాన పాత్రలు పోషిస్తున్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. జులై 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇప్పటికే యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమాలో కొన్ని మార్పులు చేయాలని కోరింది. ద్వితీయార్ధంలో వచ్చే కొన్ని సన్నివేశాల తీవ్రతను తగ్గించి, ప్రత్యామ్నాయ దృశ్యాలను పెట్టాలని సూచించింది. ప్రథమార్ధంలోని ఓ డైలాగ్‌ను తొలగించి, మరో రెండు సంఘటనల విజువల్స్‌ను తగ్గించాలని ఆదేశించింది. మద్యం తీసుకునే సన్నివేశాల్లో గమనిక వేయాలని, మూవీలోని అన్ని పాటలకూ సబ్‌టైటిల్స్ జోడించాలని కోరింది. సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ కోసం వారి తల్లిదండ్రుల నుంచి అనుమతి లేఖను సమర్పించాలని ఆదేశించింది. తాజాగా ఆల్ఫా ఈ పనులన్నీ పూర్తి చేసుకుంది. ఈ భారీ యాక్షన్ సినిమా నిడివి 2 గంటల 20 నిమిషాల 48 సెకన్లు. ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ మూవీలో బాబీ దియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తుండగా, హృతిక్ రోషన్ అతిథి పాత్రలో కనిపించనున్నారు.



# టాక్సిక్ నుంచి లేడీస్ అండీస్ గ్లింప్స్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న హై-బడ్జెట్ చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఇప్పటివరకు యష్ లుక్స్, యాక్షన్‌తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన మేకర్స్, తాజాగా ఈ చిత్రంలోని పవర్‌ఫుల్ మహిళా పాత్రలను పరిచయం చేస్తూ మరింత బోల్డ్‌గా 'లేడీస్ అండ్ లేడీస్' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ఊహించని విధంగా అత్యంత బోల్డ్, రా అండ్ రస్టిక్ విజువల్స్‌తో సాగింది. చిత్రంలో నటిస్తున్న లేడీస్ అందరినీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, మరియు రుక్మిణి వసంత్ లతో కూడిన ఈ భారీ లేడీ కాస్టింగ్ గ్లింప్స్‌లో మునుపెన్నడూ చూడని బోల్డ్ అవతార్లలో కనిపించి షాక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'డాడీ ఈజ్ హోమ్' అంటూ యష్ ఎంతటి పవర్‌ను చూపించాడో, ఈ లేడీ గ్యాంగ్ అంతకంటే ఎక్కువ 'టాక్సిక్'గా ఉండబోతోందని ఈ గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం ఆగస్ట్ 26, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



# యషికా ఆనంద్ సినీ ప్రయాణం

తమిళ సినీ పరిశ్రమలో గ్లామరస్ పాత్రలు, ప్రత్యేకమైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి యషికా ఆనంద్ సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, తక్కువ సమయంలోనే కథానాయికగా ఎదిగి తమిళ ప్రేక్షకుల్లో మంచి ఆదరణను సంపాదించారు. సినిమాలతో పాటు రియాలిటీ షోల ద్వారా కూడా ఆమెకు ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది. 1999 ఆగస్టు 4న న్యూఢిల్లీలో జన్మించిన యషికా ఆనంద్ అనంతరం చెన్నైలో స్థిరపడ్డారు. 2016లో విడుదలైన 'ధురువంగల్ పత్తినారు' చిత్రంతో సినీరంగంలో అడుగుపెట్టిన ఆమె, సహాయ పాత్రలో నటించినప్పటికీ తన నటనతో గుర్తింపు పొందారు. 2018లో విడుదలైన 'ఇరుట్టు అరైయిల్ మురట్టు కుత్తు' చిత్రంలో పోషించిన పాత్రతో యషికా ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అదే ఏడాది ప్రసారమైన 'బిగ్‌బాస్ తమిళం - రెండో సీజన్'లో పాల్గొని మరింత ప్రజాదరణను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఆమెకు అభిమానులను మరింత పెంచింది.తర్వాత 'జాంబీ', 'సిల నొడిగలిల్', 'వెపన్', 'డీడీ నెక్స్ట్ లెవల్' వంటి చిత్రాల్లో నటించిన యషికా ప్రస్తుతం 'టీఎన్ 2026', 'రాజభీమ', 'కలెక్టర్', 'టాస్' తదితర చిత్రాలతో బిజీగా ఉన్నారు. మోడల్‌గా ప్రారంభమైన ఆమె ప్రస్థానం ప్రస్తుతం దక్షిణ భారత చిత్రసీమలో గుర్తింపు పొందిన నటిగా కొనసాగుతోంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ యువతలో మంచి ఆదరణను పొందుతున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com